APTEL/26/A0542

# స్ఫూర్తి పత్రిక

Voice of Truth

విలేకరులు కావలెను
స్ఫూర్తి పత్రిక డైలీ పేపర్ నందు
కర్నూలు,నంద్యాల,అనంతపురం, శ్రీ సత్యసాయి, వైయస్సార్ ,తిరుపతి, అన్నమయ్య ,చిత్తూరు ,జిల్లాలలో పనిచేసేందుకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ నియోజకవర్గ ఇన్చార్జిలు మండల రిపోర్టర్లు కావలెను.
స్ఫూర్తి పత్రిక Voice of Truth
గతంలో పత్రికా రంగంలో పనిచేసిన అనుభవం వార్తలు చక్కగా రాయగలిగే నైపుణ్యం గల వారికి అవకాశం కలదు.
ఎటువంటి యాడ్స్ టార్గెట్లు లేదు. కొత్త వారికి అవకాశం కలదు.
ఆసక్తి గలవారు సంప్రదించండి : 8179446036,7794947413.


ప్రచురణ : కర్నూలు | సంపాదకుడు : నరసనాయుడు బోయ | సంపుటి : 01 సంచిక : 208 | పేజీలు : 04 వెల రూ. 2/- | శుక్రవారం 18-09-2026
PUBLICATION : KURNOOL | EDITOR : NARASANAIDU BOYA | VOLUME : 01 ISSUE : 208 | PAGES : 04 PRICE : 2 | FRIDAY 18 SEPTEMBER 2026



## రాజకీయాల్లో హుందాతనానికి ప్రతీక నాని.. మంత్రి లోకేశ్ భావోద్వేగ నివాళి

- గుండెపోటుతో మరణించిన ఆళ్ల నానికి మంత్రి లోకేశ్ నివాళి
- రాజకీయాల్లో నాని హుందాగా వ్యవహరించారని కొనియాడిన లోకేశ్
- వ్యక్తిగత విమర్శలకు తావివ్వకుండా సమస్యలపైనే పోరాడారన్న మంత్రి మిగతా 2 లో

## తెలంగాణలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు.. ఓటర్ల జాబితా షెడ్యూల్ విడుదల




- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా తయారీకి షెడ్యూల్ విడుదల
- మహబూబ్‌నగర్, వరంగల్ నియోజకవర్గాలకు ఎన్నికల ప్రక్రియ
- సెప్టెంబర్ 20 నుంచి నవంబర్ 6 వరకు దరఖాస్తుల స్వీకరణ
- పాత ఓటర్లు కూడా మళ్లీ కొత్తగా నమోదు చేసుకోవాలని స్పష్టం
- డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితా ప్రకటన

హైదరాబాద్: తెలంగాణలోని రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా తయారీ షెడ్యూల్‌ను మిగతా 2 లో


2లో

## రాష్ట్రంలో తీవ్ర కరవుపై ముందస్తు చర్యలు శూన్యం కూటమి ప్రభుత్వంపై జగన్ ధ్వజం

- రాష్ట్రంలో కరవు పరిస్థితులపై జగన్ ఆందోళన
- ఈ ఖరీఫ్‌లో సాగు 56.4 లక్షల ఎకరాలకే పరిమితమయిందన్న జగన్
- రైతులను నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో తీవ్రమవుతున్న

## పదే పదే ప్రెస్‌మీట్లు పెట్టి నిరాధార వ్యాఖ్యలు చేస్తున్నారు జగన్ పై అనిత ఫైర్


2లో

- డీఎస్సీ నియామకాలపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని అనిత మండిపాటు
- డీఎస్సీ పూర్తయిన ఏడాది తర్వాత బురద చల్లుతున్నారని ఆగ్రహం
- వాస్తవాలు ఏమిటో ప్రజలకు తెలుసని వ్యాఖ్య

# కాశీలో బాలాజీ ఆలయానికి 10 ఎకరాలు కేటాయించాలి

## వారణాసిలో ప్రధాని మోదీ జన్మదిన వేడుకల్లో చంద్రబాబు

వారణాసిలో చంద్రబాబు వాగ్ధాటి..

'VKS' మంత్రంతో సభికులను అలరించిన ఏపీ సీఎం

- మోదీ పాలనను వివరిస్తూ 'VKS' మంత్రాన్ని ఆవిష్కరించిన సీఎం
- చంద్రబాబు ప్రసంగానికి రాజ్‌నాథ్ సింగ్ ప్రత్యేక అభినందనలు
- ఎన్డీఏ బంధం చెక్కుచెదరదని, ఏపీకి అండగా నిలిచారని స్పష్టీకరణ



అమరావతి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టినరోజు సందర్భంగా వారణాసిలో నిర్వహించిన 'కాశీ-వాద్‌నగర్ సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రసంగం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రుద్రాక్ష్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ సభలో ఆయన తన వాగ్ధాటితో మిగతా 2 లో


2లో

## కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై ప్రభుత్వ దృష్టి.. రంగంలోకి రెవెన్యూ అధికారులు

- కేసీఆర్ ఫామ్‌హౌస్ భూములపై ప్రభుత్వం చర్యలు
- సమీపంలోని ప్రభుత్వ భూములపై రెవెన్యూ అధికారుల ఆరా

## మోదీ ప్రసంగాల్లో జెన్-జీ స్లాంగ్.. ప్రధాని వాడిన ఆ పదాల అర్థమేంటో తెలుసా?

### ప్రసంగాల్లో జెన్-జీ స్లాంగ్ వాడుతున్న ప్రధాని మోదీ

- యువతకు చేరువయ్యేందుకు కొత్త కమ్యూనికేషన్ వ్యూహం
- 'ఫ్లెక్స్', 'ఫోమో', 'ఓజీ' వంటి పదాల వినియోగం
- ఎన్‌ఆర్‌సీసీ, ఇండియా-డెన్మార్క్ సదస్సుల్లో ఈ పదాల ప్రస్తావన
- యువ ఓటర్లను ఆకర్షించడమే ప్రధాన లక్ష్యంగా విశ్లేషణ



ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ తన ప్రసంగ శైలిలో మార్పులు చేస్తూ, యువతకు మరింత చేరువయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా, నేటి తరం మిగతా 2 లో

## చైనా నుంచి బయటకు వెళ్లడం ఇక అంత ఈజీ కాదు.. కొత్త రూల్స్‌తో షాక్!

### చైనాలో కొత్త నిష్క్రమణ ఆంక్షలు అమల్లోకి

- పౌరులు, విదేశీయుల ప్రయాణంపై అధికారులకు విస్తృత అధికారాలు
- జాతీయ భద్రత పేరుతో ఆంక్షలు విధించే అవకాశం
- నిబంధనలపై హెచ్‌ఆర్‌డబ్ల్యూ తీవ్ర ఆందోళన
- విదేశీయులపైనా గతంలో ఆంక్షలు విధించిన ఉదాహరణలు



ఢిల్లీ: చైనా ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త నిబంధనలపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. దేశ పౌరులతో పాటు విదేశీయులు చైనా నుంచి బయటకు వెళ్లకుండా అడ్డుకునే అధికారం అధికారులకు ఈ నిబంధనలు కల్పిస్తున్నాయని హ్యూమన్ రైట్స్ వాచ్ మిగతా 2 లో


# తెలంగాణ పోరాట స్ఫూర్తితో ఆధునిక తెలంగాణను నిర్మించుకుందాం

## తెలంగాణను ప్రపంచం గర్వించే రాష్ట్రంగా తీర్చిదిద్దుకుందాం

- సెప్టెంబర్ 17వ తేదీ మన బాధ్యతను కూడా గుర్తు చేసే రోజు
- ఈ చారిత్రక నేపథ్యం, ఉద్యమాల ఫలాలు ప్రజల జీవితాల్లో కనిపించాలి
- రైతుకు భరోసా ఉండాలి. మహిళలు ఆర్థికంగా ఎదగాలి. అట్టడుగు వర్గాలకు న్యాయం జరగాలి



హైదరాబాద్: రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు అభివృద్ధి చేరడానికి నాలుగు కోట్ల ప్రజల భాగస్వామ్యంతో తెలంగాణను ప్రపంచం గర్వించే రాష్ట్రంగా తీర్చిదిద్దుకుందామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణ పోరాట స్ఫూర్తితో ఆధునిక తెలంగాణను నిర్మించుకుందామని అన్నారు. సెప్టెంబర్ 17 తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి గారు మాట్లాడారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అభివృద్ధి అన్ని ప్రాంతాలకు చేరాలన్నదే ప్రజాప్రభుత్వ లక్ష్యంగా చెప్పారు. తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా మిగతా 2 లో


2లో

## 2004 అఫిడవిట్‌లో ఒక్క ఎకరం లేదు.. కేసీఆర్ భూములపై పొంగులేటి సంచలన ప్రశ్నలు

- 2004 అఫిడవిట్‌లో కేసీఆర్‌కు భూమి లేదన్న పొంగులేటి
- ఇప్పుడు వేల కోట్ల విలువైన భూములు ఎలా వచ్చాయని ప్రశ్న
- కేసీఆర్ భూస్వామ్య కుటుంబంలో పుట్టారన్న బీఆర్ఎస్ వాదనపై కౌంటర్

## కేసీఆర్, కుటుంబ ఆస్తులపై రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు.. తీవ్రంగా స్పందించిన కేటీఆర్


2లో

- కేసీఆర్‌కు 1,000 ఎకరాల ఫామ్‌హౌస్ ఉందనడంపై కేటీఆర్ ఆగ్రహం
- మాజీ సీఎంకు ఉన్నది 67 ఎకరాలేనని స్పష్టం
- పుట్టుక నుంచి తమ ఆస్తులపై విచారణకు సిద్ధమని ప్రకటన
- మీ ఆస్తులపైనా విచారణకు సిద్ధమా అంటూ రేవంత్‌కు సవాల్
- సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్

## రాష్ట్రంలో తీవ్ర కరవుపై ముందస్తు చర్యలు శూన్యం
## కూటమి ప్రభుత్వంపై జగన్ ధ్వజం

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో తీవ్రమవుతున్న కరవు, వర్షాభావ పరిస్థితులపై వైసీపీ అధినేత జగన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి రీజనల్ కో-ఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన జిల్లాల వారీగా పరిస్థితులపై సమీక్ష జరిపారు. ఖరీఫ్ ప్రారంభం నుంచి సెప్టెంబర్ 16 వరకు రాష్ట్రంలో 51 శాతానికి పైగా వర్షపాతం లోటు నమోదైందని, మొత్తం 688 మండలాల్లో 628 మండలాలు తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని ఈ సందర్భంగా తెలిపారు. ఎల్‌నినో ప్రభావం ఉంటుందని ముందే తెలిసినా కూటమి ప్రభుత్వం నివారణ చర్యలు చేపట్టడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ఖరీఫ్‌లో సాధారణంగా 76 లక్షల ఎకరాల్లో సాగు జరగాల్సి ఉండగా కేవలం 56.4 లక్షల ఎకరాలకే పరిమితమైందని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. విత్తనం వేయలేకపోయిన రైతులకు ఎకరాకు రూ.15,000, పంట దెబ్బతిన్న రైతులకు ఎకరాకు రూ.25,000 చొప్పున ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు ఉచిత పంటల బీమాను పునరుద్ధరించి పాత బకాయిలైన రూ.3,000 కోట్లను విడుదల చేయాలన్నారు. ఒక్కో రైతుకు అన్నదాత సుఖీభవ కింద పెండింగ్‌లో ఉన్న రూ.41,000 చెల్లించాలని సూచించారు. ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.6,000 కోట్లు అందించాలన్నారు. రాయలసీమ ప్రాజెక్టులకు నీటిని తరలించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని ఆరోపించారు. సాగునీటి రంగంలో ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును తప్పుబడుతూ, పోలవరం నిల్వ సామర్థ్యంపై రాజీపడుతూ ఉనికి కోసం లిఫ్ట్ ప్రాజెక్టులతో డ్రామాలు ఆడుతున్నారని జగన్ విమర్శించారు. కరవు బారిన పడిన గ్రామీణ ప్రాంత ప్రజల కోసం అదనంగా 150 రోజుల ఉపాధి హామీ పనులు కల్పించాలని, తాగునీటి ఎద్దడి నివారణకు ఉచిత ట్యాంకర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు వైసీపీ క్షేత్రస్థాయి కార్యాచరణ చేపడుతుందని, త్వరలోనే తాను స్వయంగా కరవు ప్రాంతాల్లో పర్యటించి రైతులకు అండగా నిలుస్తానని స్పష్టం చేశారు.

## చైనా నుంచి బయటకు వెళ్లడం ఇక అంత ఈజీ కాదు..

ఢిల్లీ: చైనా ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త నిబంధనలపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. దేశ పౌరులతో పాటు విదేశీయులు చైనా నుంచి బయటకు వెళ్లకుండా అడ్డుకునే అధికారం అధికారులకు ఈ నిబంధనలు కల్పిస్తున్నాయని హ్యూమన్ రైట్స్ వాచ్ (హెచ్‌ఆర్‌డబ్ల్యూ) తెలిపింది. ఈ నిర్ణయం అంతర్జాతీయంగా గుర్తించిన దేశాన్ని విడిచి వెళ్లే హక్కుకు విరుద్ధంగా ఉందని పేర్కొంది. సెప్టెంబరు 15 నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చాయి. జాతీయ భద్రత, ప్రమాదాల పేరుతో, స్పష్టత లేని కారణాలతో ప్రయాణాన్ని అడ్డుకునే అవకాశం అధికారులకు కల్పించారని హెచ్‌ఆర్‌డబ్ల్యూ ఆరోపించింది. దేశం విడిచి వెళ్లడంపై ఆంక్షలు విధించాలంటే అవి అవసరమైనవి, సముచితమైనవిగా ఉండాలని అంతర్జాతీయ మానవ హక్కుల చట్టాలు చెబుతున్నాయని సంస్థ పేర్కొంది. హెచ్‌ఆర్‌డబ్ల్యూ ఆసియా విభాగం డిప్యూటీ డైరెక్టర్ మాయా వాంగ్ ఈ నిర్ణయంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఎవరిని దేశం నుంచి బయటకు వెళ్లనివ్వాలి? ఎవరిని అడ్డుకోవాలి? అన్నది అధికారులు తమ ఇష్టానుసారం నిర్ణయించే పరిస్థితి ఏర్పడుతోందని ఆమె అన్నారు. మానవ హక్కుల కార్యకర్తలు, కొన్ని మైనారిటీ వర్గాల అంతర్జాతీయ ప్రయాణాలపై ఇప్పటికే చైనా అధికారులు నిఘా, ఆంక్షలు పెంచారని తెలిపారు. విదేశీయులపైనా ఇదే పరిస్థితి ఉండొచ్చని హెచ్‌ఆర్‌డబ్ల్యూ హెచ్చరించింది. 2025 జులైలో ఓ అమెరికా ప్రభుత్వ ఉద్యోగి, వెల్స్ ఫార్గో బ్యాంక్ అధికారి చైనా నుంచి బయటకు వెళ్లకుండా అధికారులు అడ్డుకున్నారని పేర్కొంది. వారిపై ఎలాంటి క్రిమినల్ కేసులు నమోదు కాలేదని తెలిపింది. చైనా గత దశాబ్దంలో దేశం విడిచి వెళ్లే విషయంలో ఆంక్షలను క్రమంగా పెంచిందని హెచ్‌ఆర్‌డబ్ల్యూ పేర్కొంది. ముఖ్యంగా మతపరమైన మైనారిటీలు, మానవ హక్కుల కార్యకర్తలపై ప్రయాణ పరిమితులు పెరిగాయని తెలిపింది. 2016లో జిన్‌జియాంగ్ అధికారులు గతంలో జారీ చేసిన పాస్‌పోర్టులను స్వాధీనం చేసుకున్న తర్వాత మైనారిటీ ఉయ్‌గర్ ముస్లింల విదేశీ ప్రయాణంపై ఆంక్షలు మరింత తీవ్రమయ్యాయని చెప్పింది. కొత్త నిబంధనలు భావ వ్యక్తీకరణ, విద్యా స్వేచ్ఛపై కూడా ప్రభావం చూపొచ్చని హెచ్‌ఆర్‌డబ్ల్యూ ఆందోళన వ్యక్తం చేసింది. దేశం విడిచి వెళ్లకుండా అడ్డుకుంటారనే భయంతో చైనా పౌరులు, విదేశీయులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడంలో వెనుకడుగు వేసే అవకాశం ఉందని పేర్కొంది.

## కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై ప్రభుత్వ దృష్టి..
## రంగంలోకి రెవెన్యూ అధికారులు

హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు చెందిన ఫామ్‌హౌస్ భూములపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించింది. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం సమీపంలో ఉన్న ప్రభుత్వ భూముల వివరాలను రెవెన్యూ అధికారులు సేకరిస్తున్నారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో నివేదికలు సిద్ధం చేస్తున్నారు. ఫామ్‌హౌస్‌కు సమీపంలో ఉన్న ప్రభుత్వ భూముల సర్వే నంబర్లు, గతంలో ఆ భూములను సాగు చేసిన రైతుల పేర్లు, ప్రస్తుత భూ రికార్డుల వివరాలతో అధికారులు సమగ్ర నివేదికలను రూపొందిస్తున్నారు. కేసీఆర్ ఫామ్‌హౌస్ భూములపై విచారణ జరిపిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ ప్రకటనకు అనుగుణంగానే అధికారులు ఇప్పుడు చర్యలు ప్రారంభించారు. ఇందులో భాగంగానే ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంపై దృష్టి పెట్టారు. కేసీఆర్ భూముల విస్తీర్ణం, వాటి స్వరూపంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయ వివాదం కొనసాగుతున్న తరుణంలో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది.

## తెలంగాణలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు..
## ఓటర్ల జాబితా షెడ్యూల్ విడుదల

హైదరాబాద్: తెలంగాణలోని రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా తయారీ షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్, వరంగల్-ఖమ్మం-నల్గొండ స్థానాలకు ఓటర్ల నమోదు ప్రక్రియ త్వరలోనే ప్రారంభం కానుంది. ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, సెప్టెంబర్ 20న ఓటర్ల నమోదుకు సంబంధించి పబ్లిక్ నోటీసు జారీ చేయనున్నారు. అప్పటి నుంచి నవంబర్ 6 వరకు అర్హులైన పట్టభద్రులు తమ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అనంతరం నవంబర్ 25న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. ఈ జాబితాపై అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణకు నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు గడువు ఉంటుంది. వీటిని పరిష్కరించిన అనంతరం, డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితాను విడుదల చేస్తారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఒక కీలక విషయాన్ని స్పష్టం చేశారు. గతంలో పట్టభద్రుల ఓటరుగా పేరు నమోదు చేసుకున్న వారు కూడా తప్పనిసరిగా తిరిగి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పాత ఓటు రద్దవుతుందని, కొత్త జాబితాలో పేరు నమోదైతేనే ఓటు హక్కు వినియోగించుకోవడానికి అవకాశం ఉంటుందని వివరించారు. ప్రస్తుతం ఈ రెండు స్థానాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్సీలు వాణీదేవి, తీన్మార్ మల్లన్నల పదవీకాలం వచ్చే ఏడాది మార్చి నెలతో ముగియనుంది. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా రూపకల్పన ప్రక్రియను ప్రారంభించింది.

## 2004 అఫిడవిట్‌లో ఒక్క ఎకరం లేదు..
## కేసీఆర్ భూములపై పొంగులేటి సంచలన ప్రశ్నలు

హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ భూముల వ్యవహారంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మరోసారి తీవ్ర ఆరోపణలు చేశారు. 2004 కరీంనగర్ లోక్‌సభ ఎన్నికల అఫిడవిట్‌లో తనకు ఒక్క ఎకరం భూమి కూడా లేదని కేసీఆర్ పేర్కొన్నారని గుర్తుచేశారు. ఇప్పుడు వేల కోట్ల విలువైన భూములు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. కేసీఆర్ పుట్టుకతోనే వందల ఎకరాల భూస్వామ్య కుటుంబంలో జన్మించారంటూ బీఆర్ఎస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలకు ఎక్స్ వేదికగా కౌంటర్ ఇచ్చారు. కేసీఆర్ స్వయంగా సమర్పించిన ఎన్నికల అఫిడవిట్లను గతంలో ఎక్స్‌లో పంచుకున్న పొంగులేటి.. తెలంగాణ ఉద్యమ కాలంలో, ఆ తర్వాత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఆయన ఆస్తులు భారీగా పెరిగాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఎన్నికల అఫిడవిట్లే స్పష్టం చేస్తున్నాయని అన్నారు. బీఆర్ఎస్ పదేళ్లు అధికారంలో ఉన్న సమయంలో తెలంగాణ ఉద్యమకారులకు అప్పులు మిగిలితే.. కేసీఆర్ కుటుంబానికి మాత్రం లక్షల కోట్ల విలువైన ఆస్తులు ఎలా వచ్చాయని పొంగులేటి ప్రశ్నించారు. ప్రభుత్వ భూములు, పేదలు, దళితులకు చెందిన అసైన్డ్ భూములను దోచుకోవడం వల్లే ఈ ఆస్తులు వచ్చాయా అని నిలదీశారు. అయితే ఇవన్నీ ఆరోపణలేనని, వాటిపై సంబంధిత ఆధారాలు లేదా అధికారిక నిర్ధారణను పొంగులేటి తన పోస్టులో వెల్లడించలేదు. ఉద్యమకారుల త్యాగాల పునాదులపై కల్వకుంట్ల కుటుంబం ఆస్తులు కూడ బెట్టుకుందని పొంగులేటి ఆరోపించారు. కేసీఆర్‌కు పుట్టుకతోనే వందల ఎకరాలు ఉన్నాయని కేటీఆర్ చెబుతున్నారని, మరి 2004 ఎన్నికల అఫిడవిట్‌లో ఆ వివరాలు ఎందుకు లేవని ప్రశ్నించారు. ఎన్నికల అఫిడ విట్‌లో తప్పులు రాశారా? లేక ప్రజలకు తప్పుడు సమాచారం చెబుతున్నారా? అని కేటీఆర్‌ను పొంగులేటి నిలదీశారు.

## మోదీ ప్రసంగాల్లో జెన్-జీ స్లాంగ్..
## ప్రధాని వాడిన ఆ పదాల అర్థమేంటో తెలుసా?

ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ తన ప్రసంగ శైలిలో మార్పులు చేస్తూ, యువతకు మరింత చేరువయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా, నేటి తరం యువత (జెన్-జీ) ఎక్కువగా వాడే ఆధునిక పరిభాషను, స్లాంగ్ పదాలను తన ప్రసంగాల్లో ఉపయోగిస్తూ అందరినీ ఆకర్షిస్తున్నారు. ఆయన ప్రసంగాల్లో ఈ కొత్త పదజాలం వాడటం వెనుక, యువ ఓటర్లను ఆకట్టుకోవాలనే స్పష్టమైన వ్యూహం కనిపిస్తోంది. ఇటీవల ఢిల్లీలోని శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ (ఎస్ఆర్‌సీసీ) శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆ కళాశాల పూర్వ విద్యార్థులను 'ఓజీ' లుగా అభివర్ణించారు. జెన్-జీ పరిభాషలో 'ఓజీ' అంటే 'ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్' అని అర్థం. అంటే తమ రంగంలో అత్యంత ప్రావీణ్యం ఉన్నవారిని, ప్రత్యేకమైన వారిని గౌరవంగా ఇలా పిలుస్తారు. ఇదే ప్రసంగంలో 'ఫ్లెక్స్' అనే పదాన్ని కూడా ఆయన వాడారు. "ఈ రోజుల్లో కూడా ఢిల్లీ యూనివర్సిటీలో మీరు ఎస్ఆర్‌సీసీ విద్యార్థి అని చెప్పుకోవడం ఒక 'ఫ్లెక్స్' లాంటిది" అని ఆయన వ్యాఖ్యానించారు. తమకున్న హోదాను, నైపుణ్యాన్ని లేదా విజయాన్ని గర్వంగా ప్రదర్శించడాన్ని 'ఫ్లెక్స్' అంటారు. ఇంతకుముందు 2022లో డెన్మార్క్ ప్రధానితో కలిసి ఇండియా-డెన్మార్క్ బిజినెస్ ఫోరమ్‌లో ప్రసంగిస్తూ ప్రధాని 'ఫోమో' (ఫోమో) అనే పదాన్ని ప్రస్తావించారు. 'ఫియర్ ఆఫ్ మిస్సింగ్ అవుట్' అనే పదబంధానికి సంక్షిప్త రూపమే ఈ 'ఫోమో'. సోషల్ మీడియాలో ఈ పదం చాలా ప్రాచుర్యం పొందింది. భారత్‌లో పెట్టుబడులు పెట్టని వారు గొప్ప అవకాశాన్ని కోల్పోతారని, వారు 'ఫోమో'కు గురవుతారని చెప్పడానికి మోదీ ఈ పదాన్ని చమత్కారంగా ఉపయోగించారు. ప్రధాని మోదీ ఈ తరహా పదాలను ఉపయోగించడం ఒక విస్తృత కమ్యూనికేషన్ వ్యూహంలో భాగమని విశ్లేషకులు భావిస్తున్నారు. సోషల్ మీడియా, ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్ తరహా కంటెంట్‌తో యువతను ఆకట్టుకోవడం దీని ప్రధాన ఉద్దేశం. సంప్రదాయ రాజకీయ ప్రసంగాలకు భిన్నంగా, మారుతున్న కాలానికి అనుగుణంగా తనను తాను మలచుకుంటూ యువతరంతో మమేకం అయ్యేందుకు మోదీ చేస్తున్న ఈ ప్రయత్నం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది.

# తెలంగాణ పోరాట స్ఫూర్తితో ఆధునిక తెలంగాణను నిర్మించుకుందాం

మొదటి పేజి తరువాయి

తెలంగాణ పోరాట స్ఫూర్తితో ఆధునిక తెలంగాణను నిర్మించుకుందామని అన్నారు. సెప్టెంబర్ 17 తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి గారు మాట్లాడారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అభివృద్ధి అన్ని ప్రాంతాలకు చేరాలన్నదే ప్రజాప్రభుత్వ లక్ష్యంగా చెప్పారు. తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా 4 కోట్ల తెలంగాణ ప్రజలకు ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రజల స్వేచ్ఛ, ఆత్మగౌరవం, హక్కుల కోసం పోరాడిన యోధులకు ఈ చారిత్రక సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. "అభివృద్ధి, సంక్షేమంతో పాటు ఆత్మగౌరవం, స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం మా ప్రజా పాలనకు పునాదులు. సెప్టెంబర్ 17వ తేదీ మన బాధ్యతను కూడా గుర్తు చేసే రోజు. ఈ చారిత్రక నేపథ్యం, ఉద్యమాల ఫలాలు ప్రజల జీవితాల్లో కనిపించాలి. రైతుకు భరోసా ఉండాలి. మహిళలు ఆర్థికంగా ఎదగాలి. అట్టడుగు వర్గాలకు న్యాయం జరగాలి. పేద బిడ్డకు మంచి చదువు, మంచి వైద్యం అందాలి. యువతకు ప్రపంచంతో పోటీ పడే అవకాశాలు రావాలి. తరతరాల అణిచివేత, దోపిడీ, భూస్వామ్య, పెత్తందారీ విధానాలపై ధిక్కార స్వరం వినిపించిన నేల తెలంగాణ. నిరంకుశ పాలకులకు వ్యతిరేకంగా ప్రాణాలకు తెగించి పోరాడిన యోధులకు పుట్టినిల్లు తెలంగాణ. అస్తిత్వం, ఆత్మగౌరవం, హక్కుల కోసం ఈ నేల ఎప్పటికప్పుడు ప్రజా చైతన్యాన్ని రగిలించింది. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ రాజ్యం అధికారికంగా భారతదేశంలో అంతర్భాగమైంది. రాచరిక పాలన నుంచి ప్రజాస్వామ్య పాలనకు మార్గం తెరుచుకున్న చారిత్రక సందర్భం. అందుకే సెప్టెంబర్ 17ను మనం "ప్రజా పాలన దినోత్సవం"గా జరుపుకుంటున్నాం. ప్రజా పాలన అంటే ప్రజల మాటకు విలువ ఇవ్వడం... వారి సమస్యలకు పరిష్కారం చూపడం. వారి హక్కులను కాపాడడం. ప్రభుత్వ వనరులు అందరికీ చేరేలా చూడడం. అదే స్ఫూర్తితో ప్రజల ఆత్మగౌరవానికి పట్టం కడుతూ ప్రజా పాలన కొనసాగిస్తున్నాం. తెలంగాణ ఇప్పుడు పొరుగు రాష్ట్రాలతో కాదు, ప్రపంచంతో పోటీ పడుతోంది. రాష్ట్ర తలసరి ఆదాయం రూ. 4,18,931కు చేరింది. ఇది దేశ తలసరి ఆదాయం కన్నా దాదాపు 91 శాతం అధికం. అభివృద్ధి అంకెల్లో మాత్రమే కాకుండా ప్రజల జీవితాల్లో కనిపించాలన్నదే మా లక్ష్యం. ప్రజా ప్రభుత్వం రైతు పక్షపాతి. ప్రతి రైతు కుటుంబం సంతోషంగా ఉండాలనే లక్ష్యంతో రూ.2 లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేశాం. రూ.20,616 కోట్లు విడుదల చేసి 25.35 లక్షల రైతు కుటుంబాలను అప్పుల ఊబి నుంచి బయటపడేశాం. రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లకు పైగా రైతుల ఖాతాల్లో జమ చేశాం.

సన్నాలకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లించాం. ప్రభుత్వం ఇచ్చిన మద్దతుతో వరి సాగు విస్తీర్ణం, దిగుబడిలో తెలంగాణ దేశంలోనే నెంబర్‌వన్ స్థానంలో నిలిచింది. 32 నెలల్లో వ్యవసాయం, రైతు సంక్షేమానికి దాదాపు రూ.1 లక్ష 72 వేల కోట్లు ఖర్చు చేశాం. భూ భారతి చట్టం ద్వారా భూ పరిపాలనలో సమగ్ర సంస్కరణలు తీసుకొచ్చాం. భూధార్, ఏఐ ఆధారిత భూమిత్ర సేవలు ప్రారంభించాం. 5 లక్షల 94 వేల మంది రైతులకు పట్టాదార్ పాస్‌బుక్‌లు జారీ చేశాం. కృష్ణా జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన వాటా కోసం న్యాయపోరాటం చేస్తున్నాం. పాలమూరు--రంగారెడ్డి, సీతారామ ఎత్తిపోతలు, ఎస్ఎల్‌బీసీతో పాటు ఇతర పెండింగ్ ప్రాజెక్టుల పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నాం. తెలంగాణలో ప్రతి ఆడబిడ్డ సగర్వంగా జీవించాలి. ఆర్థికంగా స్వతంత్రంగా ఎదగాలి. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో మా ప్రభుత్వం పనిచేస్తోంది. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం కల్పించాం. ఈ ప్రయాణాలతో మన ఆడబిడ్డలకు రూ.12,385 కోట్ల మేర ఖర్చు ఆదా అయింది. గృహజ్యోతి కింద 53 లక్షలకు పైగా కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. 43 లక్షల కుటుంబాలకు రూ. 500కే వంటగ్యాస్ సిలిండర్ అందిస్తున్నాం. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ద్వారా 1 లక్ష 68 వేల మంది ఆడబిడ్డలకు రూ. 4,709 కోట్ల సహాయం చేశాం. 4.54 లక్షల స్వయం సహాయక సంఘాలకు రూ.60 వేల 487 కోట్ల బ్యాంకు లింకేజీ, రూ. 1,900 కోట్ల వడ్డీ రాయితీ కల్పించాం. మహిళా మార్టులు, పెట్రోల్ బంకులు, ఆర్టీసీ అద్దె బస్సులతో మహిళల ఆదాయం పెంచుతున్నాం. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 3.42 కోట్ల మందికి సన్న బియ్యం అందిస్తున్నాం. 15 లక్షలకు పైగా కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశాం. 43 లక్షలకు పైగా మందికి సామాజిక భద్రతా పింఛన్లు అందిస్తున్నాం. మేం అధికారంలోకి వచ్చిన తర్వాత పింఛన్ల కింద సుమారు రూ. 31 వేల కోట్లు అందించాం. తాజాగా మరో 2.25 లక్షల మందికి పింఛన్లు ఇచ్చేందుకు రంగం సిద్ధమైంది. ప్రతి కుటుంబం ఆత్మగౌరవంతో నివసించాలనేది మా ప్రభుత్వ ఆశయం. ఇందిరమ్మ ఇళ్ల తొలి దశలో రూ. 22,500 కోట్లతో 4.50 లక్షల ఇళ్లు మంజూరు చేశాం. ఒక్కో ఇంటికి రూ. 5 లక్షలు అందించాం. రెండో దశలో మరో 2.50 లక్షల ఇళ్లు మంజూరు చేశాం. హైదరాబాద్ నగర పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇందిరమ్మ టవర్ల నిర్మాణాన్ని ప్రారంభించాం. సామాజిక అంతరాలను తగ్గించి ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలనే లక్ష్యంతో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల సర్వేను శాస్త్రీయంగా చేపట్టాం. ఆ సర్వే గణాంకాల ఆధారంగా విద్య, ఉపాధి, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను శాసనసభలో ఆమోదించి రాష్ట్రపతి ఆమోదానికి పంపించాం. గౌరవ సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి దేశంలోనే తొలిసారిగా ఎస్సీ వర్గీకరణ చేపట్టాం. ఫిబ్రవరి 4ను ప్రతి ఏటా "తెలంగాణ సోషల్ జస్టిస్ డే" గా జరుపుకుంటున్నాం. సామాజిక న్యాయం అంటే మాకు నినాదం కాదు. వెనుకబడిన వారిని ముందుకు తీసుకురావడం. ప్రజా ప్రభుత్వానికి విద్య, వైద్యం రెండు కళ్లలాంటివి. కుల, మత భేదాలు లేకుండా పిల్లలందరికీ నాణ్యమైన విద్య అందాలనే లక్ష్యంతో ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు నిర్మిస్తున్నాం.

ఒక్కో నియోజకవర్గంలో 20 నుంచి 25 ఎకరాల్లో సకల వసతులతో వీటి నిర్మాణం చేపడుతున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ తరగతులు ప్రారంభించాం. ప్రతి నియోజకవర్గంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉదయం అల్పాహారం, పాలు అందించేందుకు రూ. 927 కోట్లు ఖర్చు చేస్తున్నాం. మధ్యాహ్న భోజనాన్ని 12వ తరగతి విద్యార్థుల వరకు విస్తరించాం. 11 లక్షల మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నాం. విద్యా రంగంలో తీసుకున్న చర్యలతో పర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్‌లో తెలంగాణ 28వ స్థానం నుంచి 18వ స్థానానికి చేరుకుంది. ప్రపంచంలోని అత్యుత్తమ విశ్వవిద్యాలయాల ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌కు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాం. అమెరికాకు చెందిన నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీతో పాటు బ్రిటన్‌లోని 17 స్వతంత్ర విద్యా సంస్థల సమాఖ్య యూనివర్సిటీ ఆఫ్ లండన్ తమ ఆఫ్‌షోర్ క్యాంపస్‌ల ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేశాయి. ఆరోగ్య రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాం. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 5 లక్షల 19 వేల మందికి రూ.2,526 కోట్ల సహాయం అందించాం. సామాన్యుడికి కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలనే లక్ష్యంతో గోషామహల్‌లో రూ.2,700 కోట్లతో కొత్త ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం మొదలైంది. సనత్‌నగర్‌లో మర్రి చెన్నారెడ్డి టిమ్స్ సూపర్? స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభించుకున్నాం. అల్వాల్, ఎల్బీనగర్ టిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను త్వరలో అందుబాటులోకి తీసుకొస్తాం. వరంగల్‌లో 2 వేల పడకలతో టిమ్స్ ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకొస్తాం. తెలంగాణ ఉద్యమంలో యువత ముందుండి పోరాడింది. ఉద్యోగాలు, ఉపాధి అవకాశాల కోసం పోరాడింది. 72 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలను పారదర్శకంగా పూర్తి చేశాం. గ్రూప్-1 నుంచి గ్రూప్-4 వరకు పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాం. ఏఐతో ఉద్యోగాల స్వరూపం మారుతోంది. కొత్త నైపుణ్యాలకు డిమాండ్ పెరుగుతోంది. అందుకే నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట వేస్తూ యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశాం. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేసుకున్నాం. ఏటీసీలో శిక్షణ పొందిన విద్యార్థులు ఈరోజు క్యాంపస్? ప్లేస్?మెంట్స్ సాధిస్తున్నారు. పాలిటెక్నిక్ కాలేజీల్లోనూ కొత్త కోర్సులు ప్రవేశపెడుతున్నాం. మన యువత ప్రపంచంతో పోటీ పడే స్థాయికి ఎదగాలి. రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులను కూడా వేగంగా విస్తరిస్తున్నాం. రూ. 38,595 కోట్లతో 122.9 కిలోమీటర్ల మెట్రో రెండో దశ విస్తరణకు ప్రతిపాదనలు పంపించాం. ఆదిలాబాద్, మామునూరు విమానాశ్రయాలకు అనుమతులు సాధించాం. అవసరమైన భూసేకరణ చేపట్టాం. హైదరాబాద్ ప్రజలకు స్వచ్ఛమైన గాలి, నీరు అందించాలనే లక్ష్యంతో మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు ప్రారంభించాం. 55 కిలోమీటర్ల పరిధిలో మూసీని పునరుజ్జీవింపజేస్తాం.

ప్రజల ఆరోగ్యంతో ఆడుకునే ఆహార కల్తీని ఎట్టి పరిస్థితుల్లో సహించం. అందుకే టీజీ సేఫ్ ఏర్పాటు చేసి కఠినంగా వ్యవహరిస్తున్నాం. యువత పెడదోవ పట్టకుండా రాష్ట్రాన్ని మాదకద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దేందుకు ఈగల్ వ్యవస్థను పటిష్ఠం చేశాం. ఈ రోజు అవసరాలు తీర్చడమే కాదు. మా లక్ష్యం రేపటి తెలంగాణను నిర్మించడం. తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాలను సాధించేందుకు ప్రజా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనేది మా సంకల్పం. దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచే దిశగా అడుగులు వేస్తున్నాం. దాదాపు 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని దేశంలో తొలి నెట్-జీరో స్మార్ట్ సిటీ నిర్మిస్తున్నాం. డిసెంబర్‌లో నిర్వహించే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 సందర్భంగా ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్‌ను ఆవిష్కరిస్తాం. ఫ్యూచర్ సిటీలో టీసీఎస్ రూ.70 వేల కోట్లతో దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్ నిర్మించేందుకు ముందుకు వచ్చింది. రూ.లక్ష కోట్ల పెట్టుబడితో అమెజాన్ ఇప్పటికే డేటా సెంటర్ నిర్మాణం చేపట్టింది. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, లైఫ్ సైన్సెస్ హబ్, ఈవీ పార్క్, ఏఐ సిటీ, హెల్త్ సిటీ, ఎడ్యుకేషన్ సిటీ వంటి ప్రత్యేక జోన్లతో ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నాం. రీజినల్ రింగ్ రోడ్డు, గ్రీన్‌ఫీల్డ్ హైవేలు, డ్రైపోర్టులు, హైదరాబాద్--నాగపూర్, హైదరాబాద్--బెంగళూరు, హైదరాబాద్--విజయవాడ పారిశ్రామిక కారిడార్లు తెలంగాణ ముఖచిత్రాన్ని మార్చనున్నాయి. రహదారులు అభివృద్ధికి సూచిక. గ్రామం నుంచి మండలానికి, మండలం నుంచి జిల్లాకు, జిల్లా నుంచి రాష్ట్ర రాజధానికి మెరుగైన రహదారి అనుసంధానం కల్పించేందుకు పనులు చేపట్టాం. ఆర్ అండ్ బీ పరిధిలో రూ.13 వేల కోట్లతో, పంచాయతీరాజ్ పరిధిలో రూ. 6,294 కోట్లతో రహదారి పనులు చేపడుతున్నాం. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. విద్యుత్ డిమాండ్ కూడా పెరిగింది. తాగునీరు, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు రాకుండా ముందస్తు ప్రణాళికలతో పనిచేస్తున్నాం. ఈ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రజల నుంచి కూడా సహకారం ఆశిస్తున్నాం. వీబీ జీ రామ్ జీలో ఎక్కువ పని దినాలు కల్పించేందుకు ప్రయత్నిస్తున్నాం" అని ముఖ్యమంత్రి గారు పేర్కొన్నారు.

# కాశీలో బాలాజీ ఆలయానికి 10 ఎకరాలు కేటాయించాలి

మొదటి పేజి తరువాయి

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రసంగం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రుద్రాక్ష్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ సభలో ఆయన తన వాగ్ధాటితో సభికులను ఉత్తేజపరిచారు. ప్రధాని మోదీ పాలన, దార్శనికత, దేశానికి అందిస్తున్న సేవలను వివరిస్తూనే, ఆంధ్రప్రదేశ్‌తో కేంద్ర ప్రభుత్వ బంధాన్ని బలంగా చాటిచెప్పారు. చంద్రబాబు ప్రసంగం ప్రారంభించకముందే రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆయనను ప్రత్యేకంగా అభినందించడం, ప్రసంగం ముగిశాక "వెరీ వెల్... వెరీ వెల్" అంటూ ప్రశంసించడం సభలో అందరి దృష్టినీ ఆకర్షించింది. చంద్రబాబు తన ప్రసంగాన్ని హర హర మహాదేవ్ అంటూ ఆధ్యాత్మిక కోణంలో ఆరంభించడం విశేషం.

'VKS' మంత్రం.. సరికొత్త నినాదం

ప్రధాని మోదీ ప్రస్థానాన్ని వివరిస్తూ చంద్రబాబు 'ఎఖా' అనే సరికొత్త మంత్రాన్ని ఆవిష్కరించారు. "ఎ అంటే మోదీ జన్మస్థలమైన వాద్‌నగర్, ఖ అంటే ఆయన కర్మభూమి అయిన కాశీ, ా అంటే ఆయన జన్మించిన సెప్టెంబర్ 17. ఈ 'ఎఖా' మంత్రం ప్రజాస్వామ్యంలో అత్యంత శక్తివంతమైనది. సానుకూల దృక్పథంతో కృషి చేస్తే ఎవరైనా అత్యున్నత శిఖరాలను అధిరోహించవచ్చని మోదీ నిరూపించారు" అని చంద్రబాబు అన్నారు. సామాన్య కుటుంబంలో పుట్టి, రైల్వే స్టేషన్‌లో టీ అమ్ముతూ, కష్టపడి చదువుకుని దేశ ప్రధాని స్థాయికి ఎదగడం యువతకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

అభివృద్ధి, సంక్షేమంలో మోదీ మార్క్

మోదీ నాయకత్వంలో గత పదేళ్లలో దేశంలో జరిగిన అభివృద్ధిని చంద్రబాబు అంకెలతో సహా వివరించారు. "మోదీ పాలనలో 25 కోట్ల మంది బహుముఖ పేదరికం నుంచి బయటపడ్డారు. 80 కోట్ల మందికి ఉచిత ఆహార ధాన్యాలు, 12 కోట్ల కుటుంబాలకు మరుగుదొడ్లు, 4 కోట్ల మందికి గృహ వసతి కల్పించారు. ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా తాగునీరు అందించాలన్నది ఆయన కల. పీఎం కిసాన్ కింద 11 కోట్ల మంది రైతులకు మధ్యవర్తులు లేకుండా నేరుగా వారి ఖాతాల్లోకి నగదు బదిలీ చేశారు" అని తెలిపారు. కరోనా మహమ్మారి సమయంలో 140 కోట్ల మంది ప్రజల ప్రాణాలను కాపాడటమే కాకుండా, 100 దేశాలకు ఉచితంగా వ్యాక్సిన్లు అందించి మానవత్వాన్ని చాటుకున్నారని ప్రశంసించారు.

ఆత్మనిర్భర భారత్ నుంచి సాంకేతికత వరకు

రక్షణ రంగంలో భారత్ సాధించిన ప్రగతిని చంద్రబాబు ప్రత్యేకంగా ప్రస్తావించారు. "ఒకప్పుడు రక్షణ పరికరాలను దిగుమతి చేసుకునేవాళ్లం. కానీ నేడు మనమే సొంతంగా తయారు చేసుకుంటున్నాం. స్పేస్ టెక్నాలజీ, డ్రోన్ టెక్నాలజీ, సెమీకండక్టర్, క్వాంటమ్ టెక్నాలజీ వరకు అన్నింటిపైనా అవగాహన ఉన్న ఏకైక నేత మోదీ" అని కొనియాడారు. స్టార్టప్‌ల ద్వారా యువత ఉద్యోగాలు సృష్టించే స్థాయికి ఎదిగిందని, మహిళా సాధికారతకు -బేటీ బచావో- నుంచి -లఖ్‌పతి దీదీ- వరకు అనేక కార్యక్రమాలు చేపట్టారని గుర్తుచేశారు.

కాశీలో బాలాజీ ఆలయానికి స్థలం ఇవ్వండి

తన ప్రసంగంలో భాగంగా ఆయన అయోధ్య రామజన్మభూమి అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. దశాబ్దాలుగా నలుగుతున్న అయోధ్య వివాదాన్ని ప్రధాని నరేంద్ర మోదీ పరిష్కరించి, రామ మందిర కలను సాకారం చేశారని చంద్రబాబు కొనియాడారు. ఈ సందర్భంగా సభికులను ఉద్దేశించి "నేను చెప్పింది నిజమే కదా?" అని ప్రశ్నిస్తూ, అందరితో "జై శ్రీరామ్" అని గట్టిగా నినాదాలు చేయించారు. దీంతో వారణాసిలోని రుద్రాక్ష్ కన్వెన్షన్ సెంటర్ ఒక్కసారిగా ఆ నినాదాలతో మార్మోగింది.

ఈ సందర్భంగా చంద్రబాబు ఒక ప్రత్యేక విజ్ఞప్తి చేశారు. "నేను పవిత్రమైన తిరుమల శ్రీ బాలాజీ కొలువైన నేల నుంచి వచ్చాను. ఈ చారిత్రక కాశీ నగరంలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించాలనుకుంటున్నాం. దీని కోసం 5 నుంచి 10 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను కోరుతున్నాను" అని అన్నారు. ఈ ప్రకటనకు సభికుల నుంచి భారీ స్పందన లభించింది. అయోధ్యలో రామమందిర నిర్మాణం చరిత్రాత్మకమని, వారసత్వ సంపదను కాపాడుతూనే అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడం మోదీకే సాధ్యమైందని చంద్రబాబు అన్నారు.

### ఏపీకి అండగా ఎన్డీఏ

ఎన్డీఏ కూటమి బంధం విడదీయరానిదని చంద్రబాబు స్పష్టం చేశారు. "అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు విషయంలో కేంద్ర ప్రభుత్వం మాకు అండగా నిలిచింది. సహకార సమాఖ్య స్ఫూర్తి మాకు కేవలం నినాదం కాదు, అది మా రోజువారీ అనుభవం. మేం కలిసే ఉన్నాం, భవిష్యత్తులోనూ కలిసే ఉంటాం. మన ఐక్యతే దేశానికి బలం" అని పునరుద్ఘాటించారు. సరైన సమయంలో, సరైన ప్రదేశంలో, సరైన నాయకుడు ఉండటం దేశానికి లభించిన గొప్ప అదృష్టమని, ఆ నాయకుడే నరేంద్ర మోదీ అని చంద్రబాబు తన ప్రసంగాన్ని ముగించారు. ఆయన ప్రసంగానికి సభికులు లేచి నిలబడి చప్పట్లతో అభినందనలు తెలిపారు.

## కేసీఆర్, కుటుంబ ఆస్తులపై రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు..

హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కుటుంబ ఆస్తులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. కేసీఆర్‌కు 1,000 ఎకరాల ఫామ్‌హౌస్ ఉందంటూ ముఖ్యమంత్రి విషప్రచారం చేస్తున్నారని, ఇందుకు ఆయన తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. కేసీఆర్‌కు ఉన్నది 1,000 ఎకరాలు కాదని, కేవలం 67 ఎకరాలు మాత్రమేనని కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ విషయాన్ని స్వయంగా ముఖ్యమంత్రే అసెంబ్లీ వేదికగా అంగీకరించారని ఆయన గుర్తుచేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ ముఖ్యమంత్రికి ఓ సవాల్ విసిరారు. "కేసీఆర్ పుట్టినప్పటి నుంచి ఇప్పటివరకు మా కుటుంబం ఆస్తులపై పూర్తిస్థాయి విచారణకు మేము సిద్ధం. మరి పుట్టినప్పటి నుంచి మీ ఆస్తులపై విచారణకు మీరు సిద్ధమా?" అని రేవంత్ రెడ్డిని ఆయన సూటిగా ప్రశ్నించారు. కేసీఆర్ వ్యవసాయాన్ని ప్రేమించే నిజమైన రైతు అని, ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనూ ఆయన సాగు చేశారని కేటీఆర్ గుర్తుచేశారు. కొందరు భూమిని ఒక వ్యాపార వస్తువుగా చూస్తే, కేసీఆర్ మాత్రం దానిని ఎంతో పవిత్రంగా భావిస్తారని పేర్కొన్నారు. చట్టబద్ధంగా కొనుగోలు చేసిన భూములపై అనవసర రాద్ధాంతం చేస్తూ రేవంత్ రెడ్డి 'సెల్ఫ్ గోల్' చేసుకుంటున్నారని ఆయన విమర్శించారు. కేసీఆర్ తండ్రికి వందల ఎకరాల ఆస్తి ఉండేదని, చింతమడకలోని తమ పాత ఇంటిని ప్రభుత్వ పాఠశాల కోసం విరాళంగా ఇచ్చారని కేటీఆర్ గుర్తుచేశారు. 22ఏ బాధితులకు బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందు ఎండగడతామని ఆయన పునరుద్ఘాటించారు.

## పదే పదే ప్రెస్‌మీట్లు పెట్టి నిరాధార వ్యాఖ్యలు చేస్తున్నారు

అమరావతి: ఏపీలో డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేస్తున్న ఆరోపణలపై రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, టీడీపీ అధికార ప్రతినిధి అప్పసాని రాజేశ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. డీఎస్సీ ప్రక్రియ పూర్తయి ఏడాది గడిచిన తర్వాత, కూటమి ప్రభుత్వంపై బురద చల్లేందుకు వైసీపీ నాయకులు అసత్యాలు ప్రచారం చేస్తున్నారని అనిత మండిపడ్డారు. వైసీపీ అధినేత జగన్ పదే పదే ప్రెస్‌మీట్లు పెట్టి నిరాధారమైన వ్యాఖ్యలు చేయడం అలవాటుగా మార్చుకున్నారని, అసలు వాస్తవాలు ఏమిటో ప్రజలకు స్పష్టంగా తెలుసని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలే వీరికి తగిన బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు. మరోవైపు, ఏపీపీఎస్సీ కుంభకోణం నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే వైసీపీ ఈ రాద్ధాంతం చేస్తోందని అప్పసాని రాజేశ్ ఆరోపించారు. డీఎస్సీ నియామకాలను అడ్డుకునేందుకు వైసీపీ నేతలు వేసిన 320 కేసులను న్యాయస్థానం కొట్టివేసిందని గుర్తు చేశారు. గత ఐదేళ్ల పాలనలో 'జాబ్‌లెస్ క్యాలెండర్'తో యువతను మోసం చేసిన జగన్, ఇప్పుడు అత్యంత పారదర్శకంగా జరిగిన డీఎస్సీపై అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

## రాజకీయాల్లో హుందాతనానికి ప్రతీక నాని..
## మంత్రి లోకేశ్ భావోద్వేగ నివాళి

అమరావతి: మాజీ ఉప ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ నేత ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ (నాని) మరణం పట్ల రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాల్లో హుందాతనానికి, రాజనీతికి ఆళ్ల నాని ప్రతీకగా నిలిచారని, ఆయన మరణంతో ఆంధ్రప్రదేశ్ ఒక గొప్ప వ్యక్తిని కోల్పోయిందని అన్నారు. ఏలూరులోని ఆళ్ల నాని నివాసానికి చేరుకున్న లోకేశ్, ఆయన పార్థివదేహంపై పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నాని కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మీడియాతో మాట్లాడుతూ.. "ఆళ్ల నాని అన్న మరణవార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆయన మంత్రిగా ఉన్న సమయంలో నేను ఎమ్మెల్సీగా శాసనమండలిలో ఉన్నాను. సభలో ఎన్నో అంశాలపై వాడివేడిగా చర్చించేవాళ్ళం. కానీ, ఆయన ఏనాడూ వ్యక్తిగత దూషణలకు దిగలేదు. ప్రజా సమస్యలపై మాట్లాడటానికే సభ సమయాన్ని ఉపయోగించాలని బలంగా నమ్మిన వ్యక్తి ఆయన. రాజకీయాల్లో హుందాతనం ఎలా ఉండాలో ఆచరణలో చూపించారు" అని లోకేశ్ గుర్తుచేసుకున్నారు. ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, మంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగా వివిధ హోదాల్లో ఆళ్ల నాని రాష్ట్రానికి చేసిన సేవలు చిరస్మరణీయమని లోకేశ్ కొనియాడారు. "ముఖ్యంగా, ప్రపంచం గజగజలాడిన కోవిడ్ మహమ్మారి సమయంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రిగా నాని అందించిన సేవలు మరువలేనివి. ఎన్నో సవాళ్లు, ఒత్తిళ్లు ఎదురైనా వాటిని అధిగమించి, ప్రజల ప్రాణాలను కాపాడటానికి, నమ్ముకున్న నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి ఆయన అహర్నిశలు శ్రమించారు" అని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీలో ఆళ్ల నాని చేరిన సందర్భాన్ని గుర్తుచేసుకుంటూ.. "మీరు క్రమశిక్షణ అనే పాఠశాలకు చెందినవారు. ఎప్పుడూ లక్ష్మణ రేఖ దాటని మీలాంటి వారిని చూసే మాలాంటి యువత రాజకీయాల్లోకి రావాలనుకుంటుంది అని నేను నాని అన్నతో చెప్పాను. అలాంటి గొప్ప వ్యక్తి ఈరోజు మన మధ్య లేకపోవడం అత్యంత బాధాకరం" అని లోకేశ్ అన్నారు. ఆళ్ల నాని కుటుంబానికి తెలుగుదేశం పార్టీ తరఫున, వ్యక్తిగతంగానూ ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆళ్ల నాని అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహిస్తున్నట్లు మంత్రి లోకేశ్ తెలిపారు. మంత్రి కొలుసు పార్థసారథి ఏలూరులోనే ఉండి అంత్యక్రియల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం, టీడీపీ తరఫున ఆళ్ల నానికి ఘన నివాళులు అర్పిస్తున్నామని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొలుసు పార్థసారథి, డా. నిమ్మల రామానాయుడు, ఎంపీ పుట్టా మహేష్ కుమార్, పలువురు ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, టీడీపీ నాయకులు పాల్గొని ఆళ్ల నానికి నివాళు లర్పించారు.

# లంచం డిమాండ్ చేశారని ఆరోపణ





**హలహర్వి, సెప్టెంబరు 17:(స్ఫూర్తి పత్రిక) :** ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్‌బాబుపై గుళ్యం గ్రామానికి చెందిన వైన్‌షాపు నిర్వాహకుడు ఏ. శ్రీధర్ తీవ్ర ఆరోపణలు చేశారు. లంచం డిమాండ్ చేయడంతో పాటు తనను వేధిస్తున్నారని ఆరోపిస్తూ గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. గుళ్యం సరిహద్దు ప్రాంతంలో ఉన్న 84వ నంబరు వైన్‌షాపు లైసెన్స్ హోల్డర్‌గా ఉన్న తన షాపు రెండేళ్ల కాలపరిమితి పూర్తికావడంతో రెన్యూవల్ ప్రక్రియపై నిర్వహించిన సమావేశంలో ప్రతి షాపునకు రూ.50 వేల చొప్పున లంచం డిమాండ్ చేశారని శ్రీధర్ ఆరోపించారు. వ్యాపారంలో నష్టాలు వస్తున్నాయని, త్రైమాసిక లైసెన్స్ ఫీజు చెల్లించడం కూడా భారంగా ఉందని, షాపు నిర్వహించలేనని చెప్పడంతో అందరి ఎదుట అవమానించి బయటకు పంపించారని వాపోయారు. గతంలో కార్యాలయానికి వెళ్లిన సమయంలోనూ సుమారు గంటపాటు తనను తీవ్ర పదజాలంతో దూషించారని తెలిపారు. అడిగిన డబ్బు ఇవ్వకపోతే వ్యాపారం సాగనివ్వనని, లేనిపోని కేసులు పెట్టి వేధిస్తానని బెదిరించినట్లు ఆరోపించారు. సరిహద్దు ప్రాంతంలో ఉన్న తమ షాపునకు సకాలంలో స్టాక్ అందకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. ఎక్సైజ్ అధికారి వ్యవహారశైలి, లంచం డిమాండ్‌పై చట్టపరంగా ఫిర్యాదు చేస్తానని శ్రీధర్ తెలిపారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి తనకు న్యాయం చేయాలని మీడియా ద్వారా కోరారు. అధికారి వివరణ రావాల్సి ఉంది.

# దేవనకొండను కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలి

- కరువు సహాయక చర్యలు వెంటనే చేపట్టాలని సీపీఎం డిమాండ్
- పంట నష్టానికి ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలని వినతి
- రైతు, కౌలు రైతు, వ్యవసాయ కూలీలకు ప్రత్యేక సాయం అందించాలి
- ఉపాధి పనులు పెంచి వలసలను అరికట్టాలని కోరిన సీపీఎం నేతలు

**దేవనకొండ, సెప్టెంబర్ 17 (స్ఫూర్తి పత్రిక):** దేవనకొండ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి వెంటనే కరువు సహాయక చర్యలు చేపట్టాలని సీపీఎం మండల కమిటీ సభ్యులు ముక్కెళ్ల అశోక్, యూసుఫ్ బాషా డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి రైతులు, వ్యవసాయ కూలీలు, కౌలు రైతులను ఆదుకోవాలని కోరారు. మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, దీంతో రైతులు సాగు చేసిన పంటలు దెబ్బతిన్నాయని వారు తెలిపారు. పెట్టుబడులు పెట్టిన రైతులకు పంట చేతికందే పరిస్థితి లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. కర్నూలు జిల్లాలో వర్షాభావ పరిస్థితులు, పంటలపై ప్రభావం గురించి ఇటీవల వచ్చిన నివేదికల్లోనూ ప్రస్తావన ఉంది. తమ వినతిపత్రంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో మండలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదని, పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని సీపీఎం నేతలు పేర్కొన్నారు. రైతులు చేసిన పెట్టుబడులు నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని, ప్రభుత్వం ప్రత్యేకంగా స్పందించి బాధిత రైతులకు ఆర్థిక సాయం అందించాలని కోరారు.

## ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలి

కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారం అందించాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. రైతులపై ఉన్న వ్యవసాయ రుణాల విషయంలో ఉపశమన చర్యలు చేపట్టాలని, పంటల బీమా సౌకర్యాన్ని అర్హులైన రైతులందరికీ వర్తింపజేయాలని కోరారు. కరువు కారణంగా కౌలు రైతులు కూడా తీవ్రంగా నష్టపోతున్నారని, వారికి కూడా ప్రభుత్వం ప్రత్యేక పరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు. వచ్చే సాగు సీజన్‌కు రైతులకు ఉచితంగా విత్తనాలు, ఎరువులు అందించి తిరిగి సాగు చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు.

## వలసల నివారణకు ఉపాధి పనులు పెంచాలి

గ్రామాల్లో ఉపాధి అవకాశాలు తగ్గిపోవడంతో వలసలు పెరగకుండా పని కోరిన ప్రతి కుటుంబానికి ఉపాధి పనులు కల్పించాలని సీపీఎం నేతలు కోరారు. కరువు పరిస్థితుల్లో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అదనపు నిత్యావసర సరుకులను ఉచితంగా అందించాలని, పశువులకు తగిన పశుగ్రాసం అందించి పశు పోషకులను కూడా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేసి భవిష్యత్‌లో వర్షాభావ పరిస్థితుల ప్రభావాన్ని తగ్గించే చర్యలు చేపట్టాలని కోరారు. దేవనకొండ మండలంతో పాటు అవసరమైన ప్రాంతాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించేందుకు ప్రభుత్వం వర్షపాతం, పంట నష్టం తదితర అధికారిక గణాంకాలను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని సీపీఎం నేతలు కోరారు. కరువు పరిస్థితుల్లో రైతు, కౌలు రైతు, వ్యవసాయ కూలీలకు ప్రభుత్వం అండగా నిలవాలని వారు విజ్ఞప్తి చేశారు.



# 15 నుంచి హ్యుండయ్ మెగా ఐపీఓ

### విలువ రూ.27,870 కోట్లు.. ఒక్కో షేరు ధర రూ.1,865-1,960

న్యూఢిల్లీ: దేశీయ ఈక్విటీ మార్కెట్ చరిత్రలో నే అతి పెద్ద ఐపీఓ వచ్చేవారం మార్కెట్‌కు వస్తోంది. దక్షిణ కొరియా ఆటోమొబైల్ దిగ్గజం హ్యుండయ్ మోటార్ కంపెనీ భారత అనుబంధ సంస్థ హుండయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ (హెచ్ఎంఐఎల్) రూ.27,870 కోట్ల సమీకరణ కోసం ఈ నెల 15న ఐపీఓ జారీ చేస్తోంది. ఇందుకోసం ఒక్కో వాటాను రూ.1,865-1,960 ధరల శ్రేణితో జారీ చేస్తోంది. 2022 మే నెలలో ఎల్ఐసీ జారీ చేసిన రూ.21,000 కోట్ల ఐపీఓనే ఇప్పటి వరకు భారత చరిత్రలో అతి పెద్ద ఇష్యూ. హెచ్ఎంఐఎల్ ఐపీఓ ఆ రికార్డును తిరగరాయనుంది. కంపెనీ అభివృద్ధిలో వాటాదారులు, ఇన్వెస్టర్లకు కూడా భాగస్వామ్యం కల్పించాలనే యోచనతో ఈ ఐపీఓ తలపెట్టినట్టు హెచ్ఎంఐఎల్ ఎండీ, సీఈఓ ఉన్సూ కిమ్ చెప్పారు. ఈ ఐపీఓ ఈ నెల 17న ముగుస్తుంది. భారత ఆటోమొబైల్ చరిత్రలోనూ ఇదే అతి పెద్ద ఐపీఓ అని భావిస్తున్నారు.

## అదానీ ఎంటర్‌ప్రైజెస్ రూ.16,600 కోట్ల క్యూఐపీ

అదానీ గ్రూప్ మరోసారి క్యూఐపీ ద్వారా పెద్ద మొత్తం లో నిధులు సమీకరిస్తోంది. గ్రూప్ ప్రధాన కంపెనీ అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఏఈఎల్) బుధవారం రూ.16,600 కోట్ల క్యూఐపీని జారీ చేసింది. ఈ క్యూఐపీ ఇష్యూ ధరను రూ.3,117.4750గా నిర్ణయించారు. ఈ ఇష్యూ ఫ్లోర్ ప్రైస్‌పై మదుపరులకు ఐదు శాతం డిస్కౌంట్ కూడా ఇచ్చే అవకాశం ఉంది. బుధవారం జరిగిన కంపెనీ ఫండ్ రైజింగ్ కమిటీ ఈ క్యూఐపీకి ఆమోద ముద్ర వేసింది. లిస్టెడ్ కంపెనీలు క్యూఐపీ ద్వారా సెబీ అనుమతి లేకుండానే నిధులు సమీకరించవచ్చు.

## వరుణ్ బెవరేజెస్ క్యూఐపీ ఇష్యూ

క్యూఐపీ ద్వారా షేర్లు విక్రయించి రూ.7,500 కోట్లు సమీకరించాలని వరుణ్ బేవరేజెస్ భావిస్తోంది. బుధవారం జరిగిన కంపెనీ డైరెక్టర్ల బోర్డు సమావేశం ఇందుకు ఆమోదం తెలిపింది. అయితే ఈ నిధుల సమీకరణ వాటాదారుల ఆమోదానికి లోబడి ఉంటుంది. ఈ నిధులను కంపెనీ వ్యాపార విస్తరణ, ఇప్పటికే ఉన్న రుణాల చెల్లింపుల కోసం వినియోగించనుంది. పెప్సికో కంపెనీ శీతల పానియాల్లో 90 శాతం వరుణ్ బేవరేజెసలోనే ఉత్పత్తి అవుతాయి.

## ఫోర్టిస్ హెల్త్‌కేర్ రూ.1,500 కోట్ల ఎన్‌సీడీ ఇష్యూ

ఫోర్టిస్ హెల్త్‌కేర్ లిమిటెడ్ (ఎఫ్‌హెచ్ఎల్) మరోసారి నిధుల సమీకరణకు సిద్ధమైంది. ప్రైవేట్ ప్లేస్‌మెంట్ పద్ధతిలో నాన్ కన్వర్టబుల్ డిబెంచర్లు (ఎన్‌సీడీలు) జారీ చేయ డం ద్వారా రూ.1,500 కోట్లు సమీకరించాలని నిర్ణయించిం ది. బుధవారం జరిగిన కంపెనీ బోర్డు సమావేశం ఇందు కు ఆమోదం తెలిపింది. ఐదేళ్ల కాల పరిమితి ఉండే ఈ ఎన్‌సీడీలను కంపెనీ బీఎసఈలో లిస్ట్ చేస్తుంది.ద

# మళ్లీ నష్టాల్లోకి స్టాక్ మార్కెట్లు

ముంబై, అక్టోబర్ 9: దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం మళ్లీ నష్టాల్లోకే జారుకున్నాయి. ఉదయం ఆరంభంలో సూచీలు లాభాల్లో కదలాడినా.. చివరి గంటలో మదుపరులు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యారు. దీంతో వరుస నష్టాల నుంచి మంగళవారం తేరుకున్నాయనిపించినా.. తిరిగి పాత బాటనే పట్టాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ ప్రధాన సూచీ సెన్సెక్స్ 167.71 పాయింట్లు లేదా 0.21 శాతం పడిపోయి 81,467.10 వద్ద ముగిసింది. అయితే ఒకానొక దశలో 684.40 పాయింట్లు పుంజుకున్నది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 31.20 పాయింట్లు లేదా 0.12 శాతం కోల్పోయి 24,981.95 వద్ద స్థిరపడింది. ఇంట్రా-డేలో మాత్రం 220.90 పాయింట్లు ఎగిసింది.

# రూ.7.51 లక్షల కోట్ల లాభం

### భారీగా పెరిగిన మార్కెట్ సంపద

### సెన్సెక్స్ 585 పాయింట్లు అప్

### 6 రోజుల తర్వాత సూచీలకు లాభాలు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్‌లో ఆరు రోజుల వరుస నష్టాలకు అడ్డుకట్ట పడింది. వేల్యూ బైయింగ్‌తో ప్రామాణిక సూచీలు మంగళవారం మెరుగైన లాభాలు నమోదు చేశాయి. సెన్సెక్స్ ఒక దశలో 713.28 పాయింట్ల వరకు ఎగబాకినప్పటికీ, చివరికి 584.81 పాయింట్ల వృద్ధితో 81,634.81 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 217.40 పాయింట్లు పెరిగి 25,013.15 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 18 లాభపడ్డాయి. అదానీ పోర్ట్స్ 4.76 శాతం రాణించి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. ఎం అండ్ ఎం 3.42 శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 2.01, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.95 శాతం బలపడ్డాయి. టాటా స్టీల్, టైటాన్, బజాజ్ ఫిన్‌సర్వ్ మాత్రం రెండు శాతానికి పైగా క్షీణించాయి. కాగా, బీఎస్ఈలోని మిడ్‌క్యాప్ సూచీ 1.86 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 2.44 శాతం పుంజుకున్నాయి. రంగాలవారీ సూచీల్లో మెటల్ మినహా అన్నీ పెరిగాయి. సర్వీసెస్ 3.25 శాతం ఎగబాకగా.. క్యాపిటల్ గూడ్స్, ఇండస్ట్రియల్స్, పవర్, టెలికాం రెండు శాతానికి పైగా పుంజుకున్నాయి. కొనుగోళ్ల జోరుతో ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.7.51 లక్షల కోట్ల పెరుగు దలతో రూ.459.50 లక్షల కోట్లకు (5.47 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది. ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 3 పైసలు పెరిగి 83.97 వద్ద ముగిసింది. అంతర్జాతీయంగా డాలర్ బలహీనపడటంతో పాటు ఈక్విటీ మార్కెట్లో లాభాలు రూపాయి బలోపేతానికి దోహదపడ్డాయి. ఇంటర్నేషనల్ మార్కెట్లో బ్రెంట్ ముడి చమురు ధర ఒక దశలో 1.84 శాతం తగ్గి 79.44 డాలర్ల వద్ద ట్రేడైంది. ఢిల్లీ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.400 తగ్గి రూ.78,300కు దిగివచ్చింది. కిలో వెండి ఏ మార్పు లేకుండా రూ.94,000 ధర పలికింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ ఒక దశలో 2,655.80 డాలర్లు, సిల్వర్ 31.43 డాలర్ల వద్ద ట్రేడైంది.

## హ్యుండయ్ ఐపీఓ ధరల శ్రేణి రూ.1,865-1,960 !?

దక్షిణ కొరియా వాహన దిగ్గజం హ్యుండయ్‌కి భారత అనుబంధ విభాగమైన హ్యుండయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ రూ.25,000 కోట్ల మెగా ఐపీఓ ధరల శ్రేణిని రూ.1,865-1,960 శ్రేణిలో నిర్ణయించే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ పబ్లిక్ ఇష్యూ 14 నుంచి ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఈ నెల 22న కంపెనీ షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేయనుందని రాయిటర్స్ కథనం పేర్కొంది.

## ఎన్ఎసడీఎల్ ఐపీఓకు సెబీ ఆమోదం

ప్రముఖ డిపాజిటరీ సేవల సంస్థ నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ (ఎన్ఎసడీఎల్) తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ప్రతిపాదనకు క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ ఆమోదం తెలిపింది. ఎన్ఎసడీఎల్‌తో పాటు తెలంగాణకు చెందిన స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ, జింకా లాజిస్టిక్స్ ఐపీఓలకూ పచ్చజెండా ఊపింది. సెబీకి సమర్పించిన డీఆర్‌హెచ్‌పీ ప్రకారం.. ఐపీఓలో భాగంగా ఎన్ఎసడీఎల్ తన వాటాదారులైన ఎస్‌బీఐ, ఎన్ఎసఈ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐడీబీఐ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ వాటాకు చెందిన 5.72 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించనుంది. ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ షేరు మంగళవారం భారీగా ఊగిసలాడింది. వినియోగదారుల హక్కుల పరిరక్షణ ప్రాధికార సంస్థ సీసీపీఏ షోకాజ్ నోటీసు జారీ చేసిన నేపథ్యంలో కంపెనీ షేరు ఉదయం ట్రేడింగ్‌లో 6.17 శాతం వరకు క్షీణించి రూ.85.21 వద్దకు జారుకుంది.

# అఖిలపక్ష సమావేశమా..

# అధికారపక్ష సమావేశమా?

- అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానించకుండా ఎన్నికల సమావేశం నిర్వహించారంటూ వామపక్షాల ఆగ్రహం
- ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారంటూ అధికారులపై ఆరోపణ
- బాధ్యులైన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్
- జిల్లా, రాష్ట్రస్థాయి ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేస్తామని వెల్లడి
- ఏకపక్షంగా సమావేశం నిర్వహించారని వామపక్షాల ఆరోపణ
- అన్ని పార్టీల అభిప్రాయాలు తీసుకోవాలని డిమాండ్
- ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత పాటించాలని విజ్ఞప్తి
- అధికారుల తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు



**దేవనకొండ, సెప్టెంబర్ 17 (స్ఫూర్తి పత్రిక):** స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి సెప్టెంబర్ 16న దేవనకొండ ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన రాజకీయ పార్టీల సమావేశం తీవ్ర వివాదానికి దారితీసింది. అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించాల్సి ఉండగా, అధికార కూటమికి చెందిన మూడు పార్టీల ప్రతినిధులతోనే సమావేశం నిర్వహించారని సీపీఎం జిల్లా నాయకుడు బి. వీరశేఖర్, సీపీఐ మండల కార్యదర్శి ఎం. నరసరావు ఆరోపించారు. ఎన్నికలకు సంబంధించిన కీలక అంశాలపై ఇలా ఏకపక్షంగా సమావేశం నిర్వహించడం సరికాదని వారు తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. గురువారం వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో విడుదల చేసిన ప్రకటనలో వారు మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి మండలంలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల అభిప్రాయాలను అధికారులు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పోలింగ్ కేంద్రాల పరిస్థితులు, ప్రజలకు ఎదురయ్యే ఇబ్బందులు, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అంశాలపై అన్ని పార్టీలతో చర్చిస్తే క్షేత్రస్థాయి సమస్యలు అధికారుల దృష్టికి వస్తాయని పేర్కొన్నారు. అయితే ఇతర రాజకీయ పార్టీలకు సమాచారం ఇవ్వకుండా కేవలం మూడు పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారని వారు ఆరోపించారు. మండలంలో జాతీయ, రాష్ట్రస్థాయి, నమోదైన ఇతర రాజకీయ పార్టీల ప్రతినిధులను ఎందుకు ఆహ్వానించలేదో అధికారులు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

## "అఖిలపక్షం పేరుతో ఏకపక్షం ఎందుకు?"

అన్ని పార్టీలకు సమాన అవకాశం కల్పించాల్సిన ఎన్నికల ప్రక్రియలో కొంతమంది ప్రతినిధులతో మాత్రమే సమావేశం నిర్వహించడంపై ప్రజల్లో అనుమానాలు తలెత్తే అవకాశం ఉందని వామపక్ష నేతలు అన్నారు. ఎన్నికల వ్యవహారాల్లో పారదర్శకత అత్యంత ముఖ్యమని, అధికార యంత్రాంగం పక్షపాతానికి తావులేని విధంగా వ్యవహరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అఖిలపక్ష సమావేశం ద్వారా మండలంలోని వివిధ వర్గాల ప్రజల అభిప్రాయాలు, సమస్యలు, పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన అనుకూల, ప్రతికూల పరిస్థితులు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లే అవకాశం ఉంటుందని తెలిపారు. అందుకు భిన్నంగా వ్యవహరించడం వల్ల ఎన్నికల నిర్వహణపై అనవసరమైన సందేహాలు ఏర్పడే పరిస్థితి వస్తుందని పేర్కొన్నారు.

## అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

సమావేశం నిర్వహణపై వచ్చిన అభ్యంతరాలను జిల్లా, రాష్ట్రస్థాయి ఎన్నికల అధికారులు పరిశీలించాలని బి. వీరశేఖర్, ఎం. నరసరావు కోరారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు విచారణలో తేలితే సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మండలంలోని కొంతమంది అధికారులు ఉద్దేశపూర్వకంగా ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారనే అనుమానాలు ఉన్నాయని వారు పేర్కొన్నారు. ఈ అంశంపై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌తో పాటు రాష్ట్రస్థాయి ఎన్నికల అధికారులను కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఎన్నికలు ప్రజాస్వామ్యానికి ప్రతిబింబమని, అన్ని రాజకీయ పార్టీలకు సమాన ప్రాధాన్యత ఇచ్చే విధంగా అధికారులు వ్యవహరించాలని సీపీఎం మండల కమిటీ, సీపీఐ మండల సమితి నాయకులు డిమాండ్ చేశారు.

### తాజా ద్వైమాసిక ద్రవ్యసమీక్షలో ఆర్బీఐ నిర్ణయం

### ముందుందు వడ్డీరేట్ల తగ్గింపునకు సంకేతాలు

### వరుసగా 10వసారి రెపోరేటు యథాతథం

# ఇకపై న్యూట్రల్ పాలసీనే..

# కఠిన ద్రవ్య విధానానికి ఆర్బీఐ స్వస్తి..

ముంబై, : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఇన్నాళ్లూ అవలంబించిన కఠిన ద్రవ్య విధానానికి స్వస్తి పలికింది. ఈ మేరకు బుధవారం ముగిసిన ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షలో నిర్ణయం తీసుకున్నది. ఇకపై 'న్యూట్రల్' పాలసీని అనుసరిస్తామని స్పష్టం చేసింది. దీంతో రాబోయే ద్రవ్యసమీక్షల్లో వడ్డీరేట్లు తగ్గుతాయన్న సంకేతాలను ఇచ్చింది. కాగా, ద్రవ్య విధానంపై ఆర్బీఐ వైఖరిని కఠినం నుంచి తటస్థానికి మార్చేందుకు కొత్త సభ్యులతో కొలువుదీరిన మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ)లోని అందరూ అంగీకరించారు. 2019 జూన్ నుంచి చూసినట్టైతే ఆర్బీఐ తటస్థ ద్రవ్య విధాన వైఖరిని తీసుకోవడం ఇదే తొలిసారి. ఈ విధానంలో ద్రవ్యోల్బణం, జీడీపీ డాటాల ఆధారంగా వడ్డీరేట్లను ఆర్బీఐ పెంచడం లేదా తగ్గించడం చేస్తుంది. ఆర్బీఐ ప్రధానంగా మూడు ద్రవ్య విధాన వైఖరిలను ప్రదర్శిస్తుంది. అందులో హాకిష్ పాలసీ ఒకటైతే, మరొకటి డోవిష్ పాలసీ. ఇంకొకటే న్యూట్రల్ పాలసీ. హాకిష్ పాలసీలో ద్రవ్యోల్బణం అదుపే లక్ష్యంగా వడ్డీరేట్లను అధిక స్థాయిల్లోనే ఉంచుతుంది. వడ్డీరేట్లను పెంచడం తప్ప తగ్గించదు. ఇక డోవిష్ పాలసీలో జీడీపీ వృద్ధికి పెద్దపీట వేస్తుంది. మార్కెట్‌లో ద్రవ్య సరఫరా పెరిగేలా, రుణ లభ్యతను పెంచేలా వడ్డీరేట్లను తగ్గిస్తూ ఉంటుంది. కాగా, తదుపరి ద్రవ్యసమీక్ష డిసెంబర్ 4-6.

## 6.5 శాతం వద్దే రెపోరేటు

రెపోరేటును ఈసారి ద్రవ్యసమీక్షలోనూ 6.5 శాతం వద్దే ఉంచుతూ ఆర్బీఐ నిర్ణయం తీసుకున్నది. ఆరుగురు సభ్యులున్న ఎంపీసీలో ఐదుగురు దీన్ని సమర్థించారు. ఇది 10వసారి కావడం గమనార్హం. గత ఏడాది ఫిబ్రవరిలో 6.25 శాతం నుంచి 6.5 శాతానికి మార్చింది. ఆ తర్వాతి నుంచి ఇది అక్కడే ఉన్నది. దీంతో ఆటో, గృహ, కార్పొరేట్, వ్యక్తిగత, ఇతరత్రా రుణాలపై వడ్డీరేట్లూ తగ్గడం లేదు. రెపోరేటు ఆధారంగానే బ్యాంకులు తమ రుణాలపై వడ్డీరేట్లను సవరిస్తాయి. దీంతో ఆర్బీఐ ఆ రేటును తగ్గిస్తే ఆయా రుణాలపై వడ్డీరేట్లూ తగ్గేందుకు ఆస్కారం ఉంటుంది. కరోనాతో పడకేసిన దేశ ఆర్థిక వ్యవస్థను బలపర్చేందుకు వడ్డీరేట్లను బాగా తగ్గించిన ఆర్బీఐ.. ఆ తర్వాత విజృంభించిన ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడానికి పెంచింది. అయితే రాబోయే రోజుల్లో ఆహార ద్రవ్యోల్బణం తగ్గుముఖం పడుతుందన్న ఆశలు, ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల కోతలు ద్రవ్య విధానం మారేందుకు దోహదం చేశాయి.

## ఎన్‌బీఎఫ్‌సీలకు హెచ్చరిక



కొన్ని బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)ల్లోని ప్రమోటర్లు నిబంధనల ఉల్లంఘనకు పాల్పడుతున్నారని, మానుకోకపోతే కఠిన చర్యలు తప్పవని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ ఈ సందర్భంగా హెచ్చరించారు. తమ సంస్థలను వేగంగా విస్తరించాలని, అభివృద్ధిపర్చాలని తప్పుడు దారుల్లో వెళ్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా చేయడం వల్ల రిస్క్ పెరుగుతుందని సూచించారు.

## రేట్ల తగ్గింపుపై ఇప్పుడే మాట్లాడలేం: దాస్

అంతర్జాతీయంగా నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ద్రవ్యోల్బణాన్ని ఎగదోసేలా ఉన్నాయని, కాబట్టి రాబోయే ద్రవ్యసమీక్షల్లో తప్పకుండా కీలక వడ్డీరేట్లు తగ్గుతాయని ఇప్పుడే చెప్పలేని పరిస్థితి అని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. సుదీర్ఘకాలంపాటు కఠిన ద్రవ్యవిధానాన్ని అవలంభించిన ఆర్బీఐ.. తాజా ద్వైమాసిక ద్రవ్యసమీక్షలో దాన్ని వీడుతున్నట్టు ప్రకటించింది. వడ్డీరేట్లపై నిర్ణయంలో ఇకపై 'న్యూట్రల్' పాలసీని అనుసరిస్తామని స్పష్టం చేసింది. దీంతో రాబోయే ద్రవ్యసమీక్షల్లో వడ్డీరేట్లు తగ్గుతాయన్న ఊహాగానాలు, అంచనాలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే దాస్ పైవిధంగా స్పందించారు. పరిస్థితులనుబట్టి వడ్డీరేట్ల యథాతథ స్థితి, తగ్గింపులపై నిర్ణయాలుంటాయని తేల్చిచెప్పారు. అయితే ద్రవ్యోల్బణంపై పోరులో ఇప్పటిదాకా ఆర్బీఐ వైఖరి ఏనుగులా సాగిందని, ఇక నుంచి గుర్రం మాదిరి దూకుడుగా ఉంటుందని వ్యాఖ్యానించడం గమనార్హం. ఇదిలావుంటే అధిక వడ్డీరేట్లతో వృద్ధిరేటుకు వచ్చే ముప్పేమీ లేదని దాస్ అన్నారు. గత ఏడాదిన్నర కాలంగా దేశ ఆర్థిక వ్యవస్థలో కార్యకలాపాలు బాగానే సాగుతున్నాయని గుర్తుచేశారు. ఈ ఆర్థిక సంవత్సరం అక్టోబర్-మార్చిలో అంచనాలను మించి వృద్ధిరేటు నమోదవుతుందన్న ఆశాభావాన్ని కనబర్చారు. డిజిటల్ లావాదేవీలకు కిక్కుయూపీఐ లైట్ వ్యాలెట్, యూపీఐ123పే ట్రాన్సాక్షన్స్ పరిమితి పెంపుఆర్టీజీఎస్, నెఫ్ట్ సిస్టమ్స్‌ల్లో కొత్త ఫీచర్‌దేశంలో డిజిటల్ చెల్లింపులను వీలైనంత ఎక్కువగా పెంచాలని చూస్తున్న ఆర్బీఐ.. తాజా ద్రవ్యసమీక్షలో ఆ మేరకు మరిన్ని కీలక నిర్ణయాలను తీసుకున్నది. ఇందులో భాగంగానే యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లైట్ వ్యాలెట్‌కున్న పరిమితిని రూ.5,000కు పెంచింది. ప్రస్తుతం ఇది రూ.2,000గానే ఉన్నది. అలాగే ఒక్కో లావాదేవీకున్న పరిమితిని కూడా రూ.1,000కి పెంచుతూ నిర్ణయం తీసుకున్నది. ఇప్పుడిది రూ.500లు మాత్రమే. ఇక యూపీఐ123పేలోనూ ఒక్కో లావాదేవీ పరిమితిని ప్రస్తుతమున్న రూ.5,000ల నుంచి రూ.10,000 పెంచుతున్నట్టు ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ తెలియజేశారు. స్మార్ట్‌ఫోన్లను వినియోగించని ఫీచర్ ఫోన్ యూజర్ల కోసం 2022 మార్చిలో యూపీఐ123ని అందుబాటులోకి తెచ్చిన విషయం తెలిసిందే. ఇప్పుడీ సౌకర్యం 12 భాషల్లో అందుబాటులో ఉన్నది. ఇదిలావుంటే రియల్ టైమ్ గ్రాస్ సెటిల్మెంట్ సిస్టమ్ (ఆర్టీజీఎస్), నేషనల్ ఎలక్ట్రానిక్ ఫండ్స్ ట్రాన్స్‌ఫర్ (నెఫ్ట్) సిస్టమ్స్‌ల్లో బెనిఫీషియరీ అకౌంట్ పేరు కనిపించే వెసులుబాటును తెస్తున్నట్టు దాస్ వెల్లడించారు. వినియోగదారుల నుంచి పెద్ద ఎత్తున వస్తున్న విజ్ఞప్తుల మేరకే ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈసారి వడ్డీరేట్లను తగ్గిస్తే ఈ పండుగ సీజన్‌లో హౌజింగ్ డిమాండ్ పుంజుకొనేది. అటు రియల్ ఎస్టేట్ రంగంలో, ఇటు యావత్తు ఆర్థిక వ్యవస్థలో వృద్ధిరేటును పరుగులు పెట్టించే ఓ మంచి అవకాశాన్ని ఆర్బీఐ చేజార్చుకున్నది.

**-బొమన్ ఇరానీ, క్రెడాయ్ జాతీయ అధ్యక్షుడు**

వృద్ధిరేటు పెరుగుదలను, ద్రవ్యోల్బణం తగ్గుదలను ఆర్బీఐ పాలసీ నిర్ణయాలు ప్రతిబింబిస్తున్నాయి. ద్రవ్య విధాన వైఖరిని ఆర్బీఐ 'న్యూట్రల్'కు మార్చడం వల్ల రాబోయే ద్రవ్యసమీక్షల్లో రెపోరేటు తగ్గేందుకున్న అవకాశాలు పెరిగాయి.

## పెట్రోలు పంపు డీలర్లకు కమీషన్ పెంపు ధరలు పెరిగే అవకాశముందా



ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) కమీషన్ పెంపుపై ఇటీవల ఎక్స్ లో పోస్ట్ చేసింది. పెండింగ్ లో ఉన్న వ్యాజ్యం పరిష్కారాన్ని అనుసరించి డీలర్ల మార్జిన్ ను సవరించినందుకు ఆనందంగా ఉందని తెలిపింది. కొత్త కమీషన్ మార్జిన్ 2024 అక్టోబర్ 30 నుంచి అమలులోకి వస్తుందని వెల్లడించింది. దీనివల్ల రిటైల్ విక్రయ ధరపై ఎలాంటి మార్పు ఉండదని తెలిపింది. కస్టమర్ సర్వీసు ప్రమాణాలను, రిటైల్ అవుట్ లెట్ సిబ్బంది సంక్షేమాన్ని పెంచడానికి దోహదపడుతుందని అభిప్రాయ పడింది. అలాగే బీపీపీఎల్, హెచ్ పీసీఎల్ కూడా తమ డీలర్ల కమీషన్ ను పెంచుతున్నట్టు తెలిపారు. సరకు రవాణాలో అంతరాష్ట్ర హేతుబద్ధీకరణ నేపథ్యంలో చమురు సంస్థలు కమీషన్ పెంపు నిర్ణయాన్ని తీసుకున్నాయి. దీని వల్ల రిటైల్ విక్రయాల్లో వైవిధ్యం తగ్గుతుంది. మోడల్ నియామావళి అమల్లో ఉన్న భౌగోళిక ప్రాంతాలలో మినహా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో ఉత్పత్తి ధరలకు విక్రయించేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకుంది. చమురు సంస్థల నిర్ణయాన్ని మంత్రి హర్దీప్ సింగ్ పూరీ స్వాగతించారు. మారుమూల ప్రాంతాల్లోని వినియోదారులకు ప్రయోజనం చేకూరేలా ఇంట్రా స్టేట్ సరుకు రవాణా హేతుబద్ధీకరణ చేయడాన్ని ప్రశంసించారు. ప్రభుత్వం రంగ సంస్థలు అంతర్రాష్ట్ర టారీఫ్ లను హేతుబద్ధీకరించడంతో కొన్ని ప్రాంతాలలో పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గే అవకాశం ఉంది. ముఖ్యంగా ఒడిశాలో మల్కన్ గిరిలోని కూనన్ పల్లి, కలిమెల లో పెట్రోలు ధర రూ.4.69 నుంచి రూ 4.55 వరకూ, డీజిల్ ధర రూ.4.45 నుంచి రూ.4.32 వరకూ తగ్గనుంది. ఛత్తీస్ గఢ్ లోని బీజాపూర్, బైలాడియా, కాటే కల్యాణ్, బచేలి, దంతేవాడలో కూడా ధరలు తగ్గనున్నాయి. వీటితో పాటు అరుణాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, మిజోరాం లలో కూడా తగ్గుదల ఉంటుంది. డీలర్ల కమీషన్ పెంపు వల్ల దేశంలోని ఇంధన అవుట్ లెట్లను ప్రతి రోజూ సందర్శించే సుమారు 7 కోట్ల మంది పౌరులకు మెరుగైన సేవలు అందనున్నాయి. డీలర్లకు కమీషన్ పెంచినా పెట్రోలు ధర పెరగకపోవడం వల్ల వారికి ప్రయోజనం కలుగుతుంది. దేశ వ్యాప్తంగా దాదాపు 83 వేల పెట్రోలు పంపులు నడుపుతున్న డీలర్లు, అలాగే వాటిలో పనిచేస్తున్న దాదాపు పది లక్షల మంది సిబ్బందికి మేలు జరుగుతుంది.

## రిటైర్మెంట్ తర్వాత కూడా ప్రతినెలా ఆదాయం కావాలా ఈ పెన్షన్ ప్లాన్‌తో ఎంతో ప్రయోజనం




పదవీ విరమణ సమయానికి మనల్ని ఆదుకునేందుకు అనేక సాధనాలు ఉన్నాయి. వాటిలో యూఎల్ఐపీ (యులిప్) పెన్షన్ ప్లాన్ అత్యంత ఉపయోగంగా ఉంటుంది. మీ పెట్టుబడిని జీవితం కాలం లెక్కించడంతో పాటు డబుల్ ఇంజిన్ ఫెక్సిబిలిటీ, మార్కెట్ లింక్డ్ గ్రోత్ ను పొందుతారు. మీ పదవీ విరమణ కార్పస్ ను పెంచడానికి చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. యూనిట్ లింక్డ్ ఇన్స్యూరెన్స్ ప్లాన్ లేదా యులిప్ అనేది ఒక రకమైన లైఫ్ ఇన్స్యూరెన్స్ పాలసీ. దీని ద్వారా బీమాతో పాటు పెట్టుబడికి ప్రయోజనం లభిస్తుంది. అంటే మీకు బీమా రక్షణ అందిస్తూనే సంపద పెంచుకోవడానికి అవకాశం కలుగుతుంది. యులిప్ లో పెట్టే పెట్టుబడిని ప్రీమియం అంటారు. దీనిలో కొంత మొత్తాన్ని బీమా కవరేజీకి, మిగిలిన దాన్ని మ్యూచువల్ ఫండ్స్ లో పెట్టుబడి పెడతారు. యులిప్ పెన్షన్ ప్లాన్ మీకు అనేక రకాల ప్రయోజనం కలిగిస్తుంది. డబ్బులను ఎక్కడ పెట్టుబడి పెట్టాలో ఎంపిక చేసుకునే అవకాశం కలుగుతుంది. మీ రిస్క్ ప్రొఫైల్, రిస్క్ అపెటిట్ ఆధారంగా ఈక్విటీ ఫండ్స్, డెట్ ఫండ్స్, లేదా ఈ రెండింటి కలయికలో మీ ప్రీమియాన్ని పెట్టుబడిగా పెట్టవచ్చు. ఒకరకంగా చెప్పాలంటే మీ ప్రీమియంలో వందశాతం వరకూ ఈక్విటీలో పెట్టుబడి పెట్టుకునే వీలుంటుంది. యలిప్ పెన్షన్ ప్లాన్ ద్వారా ఒకే ప్లాన్ లో అన్ని దశల్లోనూ సరైన బ్యాలెన్స్ చేయడానికి ఫండ్స్ మధ్య మారే వెసులుబాటు ఉంటుంది. స్థిర పోర్ట్ ఫోలియోకు కట్టుబడి ఉండకుండా మీరు నచ్చిన ఫండ్లకు మారిపోవచ్చు. రాబడి పెంచుకునే లక్ష్యంలో భాగంగా మార్కెట్ పరిస్థితులను బట్టి ఫండ్ల ను మార్చుకుంటూ వెళ్లే అవకాశం ఉంటుంది. యులిప్ పెన్షన్ ప్లాన్ లో ఐదేళ్ల పెట్టుబడిని పూర్తి చేసిన తర్వాత, డబ్బులు అవసరమైతే పాక్షిక ఉపసంహారణలు చేసుకోవచ్చు. ఉద్యోగ విరమణ తర్వాత కార్పస్ లో 60 శాతాన్ని పన్నురహితంగా ఉపసంహరించుకునే అవకాశం కలుగుతుంది. మిగిలిన 40 శాతం యాన్యుటీలో పెట్టుబడి గా జమచేస్తారు. తద్వారా ఉద్యోగ విరమణ తర్వాత మీకు నిరంతరం ఆదాయం వచ్చే అవకాశం కలుగుతుంది.

## ఈ సింపుల్ చిట్కాతో లక్ష్మీ కటాక్షమే స్టాక్ మార్కెట్‌లో అనుసరించాల్సిన వ్యూహమిదే




దీపావళి సందర్భంగా లక్ష్మీదేవి పూజ అత్యంత ప్రధానమైంది. ఎంతో భక్తిశ్రద్ధలతో ఈ పూజ నిర్వహించాలి. అప్పుడే లక్ష్మీదేవి కటాక్షం కలిగి సిరి సంపదలు, ఆరోగ్య ఐశ్వర్యాలు కలుగుతాయి. అలాగే స్టాక్ మార్కెట్ లో పెట్టుబడి పెట్టేటప్పుడు చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. పూజ చేసేటప్పుడు వివిధ వస్తువులు ఎలా ఉపయోగపడతాయో, స్టాక్ మార్కెట్ లో రాబడి పెరగడానికి మీ పెట్టుబడి పోర్ట్ పోలియో కీలకంగా ఉంటుంది. స్టాక్ మార్కెట్ లో మీ పెట్టుబడి పోర్ట్ పోలియో సక్రమంగా ఉన్నప్పుడే దీర్ఘకాలంలో రాబడి బాగా పెరుగుతుంది. ఒక వ్యక్తి లేదా సంస్థకు ఉన్న పెట్టుబడుల సమాహారాన్నే పోర్ట్ పోలియో అంటారు. దీనిలో స్టాక్ లు, బాండ్లు, నగదు, రియల్ ఎస్టేట్ తదితర విభిన్న ఆస్తులు ఉంటాయి. ఒకే దానిపై ఇన్వెస్ట్ చేయకుండా అన్నింటిపై సమానంగా ఉండేలా చూసుకోవాలి. ఒక దానిలో నష్టమొచ్చినా, మరో దానిలో లాభపడే అవకాశం ఉంది. కాబట్టి పెట్టుబడి పోర్ట్ పోలియో అనేది ప్రతి పెట్టుబడిదారుడికీ అది కీలకం. పూజ చేసేటప్పుడు వివిధ వస్తువులు ఎలా ఉపయోగపడతాయో, సంపదను పెంచడానికి మీ పోర్ట్ పోలియోలోని విభిన్న ఎంపికలు అవసరమవుతాయి.

**ఈక్విటీ**

పూజ చేసేటప్పుడు దీపం అత్యంత కీలకం. చీకటిని పారద్రోలడానికి ఇది ఉపయోగపడుతుంది. ప్రకాశవంతమైన వెలుగును అందిస్తుంది. అలాగే సంపదను పెంచేందుకు అవసరమైన వాటిలో ఈక్విటీ పెట్టుబడులు దీపంలా ఉపయోగతాయి. గదికి వెలుగును అందించే దీపంలా.. మీ సంపద పెరిగేందుకు మార్గం చూపుతాయి.. ఈక్విటీలు ఎల్లప్పుడూ సానుకూల రాబడిని అందిస్తాయి.

**బాండ్లు**

పూజ చేసేందుకు అత్యంత అవసరమైనవి పువ్వులు. వీటిని అలంకరించడం వల్ల విగ్రహానికి ఎంతో అందం వస్తుంది. మనసుకు ఉత్సహం కలిగించడంతో పాటు సువాసనలు వెదజల్లుతాయి. ఇదే మాదిరిగా మీ పోర్టు పోలియోలో బాండ్లు, డిబెంచర్లు, ప్రభుత్వ సెక్యూరిటీలు ఉపయోగపడతాయి. మీ సంపద పెరిగేందుకు ఎంతో దోహదపడతాయి. లక్ష్మీపూజలో పువ్వుల మాదిరిగా మీ పెట్టుబడులకు అందాన్ని, రాబడిని అందజేస్తాయి.

**బంగారం**

పూజలో మరో అత్యంత ముఖ్యమైన వస్తువు తిలకం. దీన్ని చాలా శుభప్రదంగా భావిస్తారు. పూజ సమయంలో అందరూ తమ నుదుటపై తిలకం ధరిస్తారు. ఇలా చేయడం వల్ల మీ పూజకు పరిపూర్ణత కలుగుతుంది. ఇదే మాదిరిగా మీ సంపదకు బంగారంపై పెట్టుబడి రక్షణగా ఉంటుంది. అత్యంత నమ్మకమైన పెట్టుబడి మార్గంగా బంగారాన్ని పేర్కొంటారు. కాబట్టి మీ పోర్ట్ పోలియోలో బంగారంపై పెట్టుబడులు తప్పనిసరిగా ఉండాలి.

**ట్రెజరీ బిల్లులు**

పూజా సమయంలో నాణేలు గానీ డబ్బును గానీ లక్ష్మీదేవి చిత్రపటం వద్ద ఉంచుతారు. పూజ చేసే సమయంలో ఇది చాలా అవసరం. తద్వారా సంపద పెరుగుతుందని భావిస్తారు. అలాగే మీ పెట్టుబడి పోర్ట్ పోలియోలో ట్రెప్స్ (ట్రెజరీ బిల్లుల తిరిగి కొనుగోలు ఒప్పందాలు) చాలా అవసరం. పూజ సమయంలో సమర్పించే నాణేల మాదిరిగా మీ పోర్ట్ పోలియో కు సంపూర్ణతను అందిస్తాయి.

# భారత్‌లో బంగారం కొనుగోళ్లు ఎందుకు పెరిగాయి చైనాను అధిగమించిన ఇండియా



కేవలం మూడు నెలల్లో జూలై నుండి సెప్టెంబర్ 2024 వరకు భారతీయులు 248.3 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఈ కాలంలో చైనాలో ప్రజలు కొనుగోలు చేసిన 165 టన్నుల కంటే 51 శాతం ఎక్కువ. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ తాజా డేటా ప్రకారం.. భారతీయులు ఎక్కువగా బంగారాన్ని నాణేలు, బార్ల రూపంలో కొనుగోలు చేస్తారు. అలాగే, జూలై-సెప్టెంబర్‌లో ఏడాది ప్రాతిపదికన ఎల్లో మెటల్ లోహానికి భారతదేశం డిమాండ్ 18 శాతం పెరిగింది.

**భారతీయుల బంగారం కొనుగోళ్లు ఎందుకు పెరిగాయి?**

ఎల్లో మెటల్ దిగుమతిని 15 శాతం నుంచి 6 శాతానికి తగ్గించడం వల్ల బంగారం డిమాండ్ పెరగడానికి ప్రధాన కారణం. జూలై 23న కేంద్ర బడ్జెట్ 2024-25 ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన ప్రసంగం సందర్భంగా దీనికి సంబంధించిన ప్రకటన చేశారు.

**పెళ్లి, పండుగ డిమాండ్**

ధన్‌తేరాస్, వివాహ డిమాండ్ కారణంగా భారతదేశం బంగారం డిమాండ్ %ు%4లో పదిలంగా ఉందని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ ప్రాంతీయ %జజుూ% సచిన్ జైన్ ఉటంకిస్తూ ఎకనామిక్ టైమ్స్ ఒక నివేదిక పేర్కొంది. సుంకం తగ్గింపు ప్రభావంతో బంగారం ధరలో నిరంతర పెరుగుదల ఉన్నప్పటికీ, పెట్టుబడిదారులు తమ హోల్డింగ్‌లకు జోడించే అవకాశాలుగా ధరల మార్పు చేర్పుల కోసం వేచి ఉండే అవకాశం చూడవచ్చని అన్నారు. జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో భారతీయ వినియోగదారులు 77 టన్నుల బంగారు నాణేలు, కడ్డీలను కొనుగోలు చేశారు. చైనీయులు 62 టన్నులు కొనుగోలు చేశారు.

**జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో..**

భారతదేశం బార్, కాయిన్ డిమాండ్ 2012 నుండి జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో అత్యధిక స్థాయికి చేరుకుంది. జూలై సుంకం నేతృత్వంలోని ధరల మార్పు చేర్పులు పెట్టుబడిదారుల ఆశావాదం, బుల్లిష్ ధర అంచనాలను వేగవంతం చేసింది. ఇది చాలా మంది పెట్టుబడిదారులను మార్కెట్లోకి ప్రవేశించడానికి అనుమతించిందని జైన్ పేర్కొన్నారని %జు% నివేదిక తెలిపింది. జులై చివరి నాటికి వినియోగదారుల డిమాండ్ ఊపందుకుంది. అలాగే సెప్టెంబర్ మధ్యకాలం వరకు బలంగా ఉందని జైన్ తెలిపారు. పెట్టుబడి డిమాండ్‌లో 41 శాతం పెరుగుదల ఉందన్నారు.

**పెరిగిన డిమాండ్**

జూలై-సెప్టెంబర్ 2024లో భారతదేశంలో బంగారు ఆభరణాల డిమాండ్ గత సంవత్సరంతో పోలిస్తే 10 శాతం పెరిగి 171.6 టన్నులకు చేరుకుంది. జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో బంగారం డిమాండ్ గరిష్ట స్థాయికి చేరుకుంది. అయితే పసుపు లోహం సగటు ధర 10 గ్రాములకు రూ. 66,614గా ఉంది. గత ఏడాది ఇదే కాలంలో 10 గ్రాములకు రూ. 51,259.80గా ఉంది. బంగారానికి బలమైన డిమాండ్ అంచనా 2024 అధ్యక్ష ఎన్నికలు, పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతల కారణంగా అస్థిర ఈక్విటీ మార్కెట్ నేపథ్యంలో బంగారం బుల్ రన్‌లో ఉంది. అయితే సంవత్సరం పూర్తిగా చూస్తే బంగారం డిమాండ్ 700-750 టన్నుల శ్రేణిలో ఉంటుందని భావిస్తున్నామని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ ప్రాంతీయ సచిన్ జైన్ అభిప్రాయపడ్డారు. గత ఎనిమిది త్రైమాసికాల్లో మొత్తం బంగారం డిమాండ్‌లో చైనాను భారత్ రెండుసార్లు అధిగమించింది. ఇది 2022, 2023 అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికాల్లో ఉంది ఈ మార్పు ఉందని నివేదికలు చెబుతున్నాయి.

# గూగుల్‌కు సవాల్ కొత్త సెర్చింజన్ చాట్‌జీపీటీ




ఇప్పటి వరకూ అంతర్జాతీయంగా, జాతీయంగా మనకు తెలియని విషయాల గురించి తెలుసుకోవాలంటే సెర్చింజన్ 'గూగుల్' శరణ్యం.. 'గూగులమ్మ'.. 'గూగుల్ తల్లి'ని అడిగేస్తే ఏ విషయమైనా తెలుస్తుందని చెబుతుంటారు. దశాబ్దాల తరబడి ఇంటర్నెట్ రంగంలో 'సెర్చింజన్'గా ఆధిపత్యం ప్రదర్శిస్తున్న గ్లోబల్ టెక్ దిగ్గజం 'గూగుల్'కు గట్టి పోటీ ఎదురవుతోంది. అదీ ఒక స్టార్టప్ సంస్థ నుంచి పోటీ వస్తోంది. ఇప్పుడు టెక్నాలజీ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) చాట్ బోట్ కీలకంగా మారింది. మరో టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ వెన్ను దన్నుతో ఏఐ బేస్డ్ చాట్‌జీపీటీ ని ఓపెన్ ఏఐ అనే స్టార్టప్ సంస్థ రెండేండ్ల క్రితం వెలుగులోకి తీసుకొచ్చింది. వచ్చీ రావడంతోనే సంచలనాలు క్రియేట్ చేసింది ఓపెన్ ఏఐ.. చాట్‌జీపీటీ. ప్రతి అంశంపైనా అథంటిక్ సమాచారాన్ని అందిస్తూ గూగుల్‌కు పోటీగా నిలిచింది. తాజాగా గూగుల్‌తో పోటాపోటీ సమాచారం నెటిజన్లకు అందించేందుకు సెర్చింజన్ సామర్థ్యంతో కూడిన ఏఐ చాట్‌బోట్‌ను ఆవిష్కరిస్తోంది చాట్‌జీపీటీ జనరేటివ్. సంబంధిత వెబ్ సోర్సెస్ కూడిన లింకులతో శేరవేగంగా, సమయానుకూల సమాధానాలు ఇచ్చేలా ఓపెన్ ఏఐ చాట్‌జీపీటీ జనరేటివ్‌ను అప్ గ్రేడ్ చేస్తున్నది. ఇంతకు ముందు అందుబాటులో ఉన్న సంప్రదాయ సెర్చింజన్ నుంచే వెబ్ సోర్సెస్ ఉపయోగించుకోనున్నది ఓపెన్ ఏఐ. చాట్‌జీపీటీ హోమ్ పేజ్ యూజర్లకు అవసరమైన టాపిక్స్ మీద నేరుగా ట్యాబ్ ఆప్షన్లు అందిస్తుంది. వాతావరణ పరిస్థితులు, వివిధ స్టాక్స్ ధరలు, స్పోర్ట్స్ స్కోర్లు, బ్రేకింగ్ న్యూస్ తదితర విషయాలపై ట్యాబ్స్ ఉంటాయని ఓపెన్ ఏఐ తెలిపింది. చాట్‌జీపీటీతో అవసరమైన సమాచారం కోసం ఓపెన్ ఏఐతో ఫ్రాన్స్ లీ మొండె, జర్మనీ యాక్సెల్ స్ప్రింగర్, బ్రిటన్ ఫైనాన్సియల్ టైమ్స్ తదితర సంస్థలు కంటెంట్ డీల్ పై సంతకాలు చేశాయి. చాట్‌జీపీటీ.కామ్ వెబ్ సైట్ తోపాటు మొబైల్ యాప్ లోనూ ఈ ఫెసిలిటీ లభిస్తుందని ఓపెన్ ఏఐ వెల్లడించింది. చాట్‌జీపీటీ ప్లస్, చాట్‌జీపీటీ టీమ్ యూజర్లు, సెర్చ్ జీపీటీ వెయిట్ లిస్ట్ యూజర్లకు ఈ సౌకర్యం తక్షణం అందుబాటులోకి తెస్తున్నమని పేర్కొంది. కొన్ని వారాల్లో ఎంటర్ ప్రైజెస్, ఎడ్యుకేషనల్ యూజర్లకు అందుబాటులోకి వస్తున్న ఈ సౌకర్యం.. చాట్‌జీపీటీని ఫ్రీగా వాడుకునే యూజర్లకు చేరువ చేయడానికి కొన్ని నెలల టైం పడుతుందని ఓపెన్ ఏఐ వివరించింది.

# ఐపీఓకు ఫుడ్ డెలివరీ సంస్థ స్విగ్గీ ఎప్పుడో తెలుసా




దేశీయ స్టాక్ మార్కెట్లలో ప్రస్తుతం కొంత సానుకూల ధోరణి నెలకొనడంతో స్టార్టప్‌లు మొదలు ఫిన్ టెక్ కంపెనీలు, ఆటోమొబైల్ తదితర కంపెనీలు ఐపీఓ ద్వారా లిస్టింగ్ అవుతున్నాయి. ఇటీవల దక్షిణ కొరియా కార్ల తయారీ సంస్థ హ్యుండాయ్ మోటార్ ఇండియా కూడా ఐపీవో ద్వారా దేశీయ స్టాక్ మార్కెట్లలో లిస్టయింది. తాజాగా ఆన్ లైన్ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ 'స్విగ్గీ సైతం ఐపీఓకు సిద్ధమైంది. ఈ ఐపీఓ ద్వారా రూ.11,300 కోట్ల నిధులు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నది. నవంబర్ మొదటి వారంలో ఐపీఓ ప్రారంభం అవుతుందని తెలుస్తోంది. ఎల్ఐసీ, హ్యుండాయ్ తర్వాత స్విగ్గీదే అతిపెద్ద ఐపీఓ కానున్నది. నవంబర్ ఆరో తేదీన మొదలై ఎనిమిదో తేదీన స్విగ్గీ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ ముగుస్తుందని సమాచారం. దీనికి సంబంధించి స్విగ్గీ ఖచ్చితమైన తేదీలు ఈ వారంలోనే వెల్లడించనున్నది. ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా రూ.6,800 కోట్లు, తాజా ఈక్విటీ షేర్ల జారీ ద్వారా రూ.4,500 కోట్ల నిధులు సేకరించడం స్విగ్గీ లక్ష్యంగా కనిపిస్తున్నది. మొత్తం 11.2 బిలియన్ డాలర్ల నిధులు సేకరించడమే లక్ష్యంగా స్విగ్గీ ఐపీఓ ఉండనున్నది. ప్రస్తుతం స్టాక్ మార్కెట్లలో అనిశ్చితి నేపథ్యంలో స్విగ్గీ తన ఐపీఓ ఇన్షియల్ టార్గెట్ 15 బిలియన్ డాలర్ల లక్ష్యంలో 25 శాతానికి కుదించుకున్నట్లు ఆ సంస్థ వర్గాలు చెబుతున్నాయి. 2022లో యూఎస్ అసెట్ మేనేజర్ ఇన్వెస్కో 700 మిలియన్ల డాలర్ల నిధుల సేకరణతో స్విగ్గీ కంపెనీ మార్కెట్ విలువ (ప్రైవేట్) 10.7 బిలియన్ డాలర్లు. మార్చ్యూ ఫండ్స్ బ్లాక్ రాక్, కెనడా పెన్షన్ ప్లాన్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డు (సీపీపీఐబీ) వంటి సంస్థలు ఐపీవో ద్వారా స్విగ్గీలో పెట్టుబడులు పెట్టే అవకాశం ఉంది. ఆన్ లైన్ ఫుడ్ డెలివరీ రంగంలో మరో సంస్థ జొమాటోతో స్విగ్గీ పోటీ పడుతున్నది. ఆన్ లైన్ ఫుడ్ డెలివరీతోపాటు కస్టమర్లకు కేవలం 10 నిమిషాల్లో గ్రాసరీ వస్తువుల సరఫరాకు 'క్విక్ కామర్స్' రంగంలో అడుగు పెట్టాయి.

# 50-ఎంపీ రేర్ కెమెరాతో గ్లోబల్ మార్కెట్లలో పోకో సీ75 ఆవిష్కరణ ఇవీ స్పెషిఫికేషన్స్



షియోమీ అనుబంధ సంస్థ పోకో తన పోకో సీ75 ఫోన్‌ను గ్లోబల్ మార్కెట్లలో ఆవిష్కరించింది. గత ఆగస్టులో ఆవిష్కరించిన రెడ్‌మీ 14 సీ ఫోన్‌ను రీబ్రాండ్ చేసి పోకో సీ75 ఫోన్ ఆవిష్కరించారని తెలుస్తున్నది. పోకో సీ75 ఫోన్ మీడియాటెక్ హెలియో జీ8 ఆల్ట్రా చిప్ సెట్ తో పని చేస్తుంది. 8 జీబీ ర్యామ్ విత్ 256 జీబీ స్టోరేజీ కలిగి ఉంటుంది. 50-మెగా పిక్సెల్ రేర్ కెమెరా, 18 వాట్ల చార్జింగ్ మద్దతుతో 5,160 ఎంఏహెచ్ కెపాసిటీ గల బ్యాటరీతో పని చేస్తుంది. ఆండ్రాయిడ్ 14 బేస్డ్ షియోమీ హైపర్ ఓఎస్ స్కిన్ వర్షన్ మీద పని చేస్తుంది. పోకో సీ75 ఫోన్ 6జీబీ ర్యామ్ విత్ 128 జీబీ స్టోరేజీ వేరియంట్ సుమారు రూ.9,170 (109 డాలర్లు), 8 జీబీ ర్యామ్ విత్ 256 జీబీ స్టోరేజీ వేరియంట్ దాదాపు రూ.10,900 (129 డాలర్లు) పలుకుతుంది. పోకో సీ 75 ఫోన్ బ్లాక్, గోల్డ్, గ్రీన్ రంగుల్లో లభిస్తుంది. 6.88 అంగుళాల హెచ్డీం (720 1640 పిక్సెల్స్) ఎల్సీడీ స్క్రీన్ విత్ 120 హెర్ట్జ్ రీఫ్రెష్ రేట్, 600 నిట్స్ పీక్ బ్రైట్ నెస్, మీడియాటెక్ హెలియో జీ81 ఆల్ట్రా ప్రాసెసర్‌తో పని చేస్తుంది. పోకో సీ75 ఫోన్ 50-మెగా పిక్సెల్ రేర్ కెమెరా, అన్ స్పెసిఫైడ్ యాగ్జిలరీ లెన్స్ కెమెరా, సెల్ఫీలూ వీడియో కాల్స్ కోసం 13-మెగా పిక్సెల్స్ సెన్సర్ కెమెరా ఉంటాయి. 4జీ ఎల్టీఈ, డ్యుయల్ బాండ్ వై-ఫై, బ్లూటూత్ 5.4, జీపీఎస్, ఎన్ఎఫ్‌సీ, 3.5 ఎంఎం హెడ్ ఫోన్ జాక్, యూఎస్బీ టైప్ %-% సీ పోర్ట్ కనెక్టివిటీ కలిగి ఉంటుంది. అంబియెంట్ లైట్ సెన్సర్, యాక్సెలరో మీటర్, ఈ-కంపాస్, వర్చువల్ ప్రాగ్జిమిటీ సెన్సర్ ఉంటాయి. 18వాట్ల చార్జింగ్ మద్దతుతో 5160 ఎంఏహెచ్ కెపాసిటీ గల బ్యాటరీతో వస్తుంది.

SPHOORTI PATRIKA (Telugu Daily) | PRGI Reg. No. APTEL/26/A0542 | Publisher, Printer & Editor: NarasaNaidu Boya | Printed at: Rajeswari Printers, Kurnool | Place of Publication: Kurnool, Andhra Pradesh | Cell: 8179446036, 7794947413 | Email: sphoortipatrika@gmail.com | Website: www.sphoortipatrika.com